విలేకరులు కావలెను
ఉదయం
జాతీయ తెలుగు దిన పత్రిక
ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే ఉదయం దినపత్రికకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9581419999

మెట్రో ఉదయం
జాతీయ తెలుగు దిన పత్రిక
సంపుటి : 12 సంచిక : 135 వెల: 3/-

జైళ్ల సామర్థ్యం ఎంత? ఖైదీలు ఎంత మంది?
• దేశంలో జైళ్ల పరిస్థితిపై సుప్రీంకోర్టు ఆందోళన



2

సోమవారం 23 మార్చి 2026 SIMULTANEOUSLY PUBLISHED FROM KURNOOL AP & TS, BENGALURU, MUMBAI, CHENNAI, KERALA, PATNA, KOLKATA & DELHI www.metroudayam.com పేజీలు 12

# 2029లోనూ అధికారం మాదే..

- ఎవరు అడ్డుకున్నా ఆగదు
- వివక్ష చూపను
- ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాలనూ అభివృద్ధి చేస్తాం
- గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లకూ సమానంగా నిధులిచ్చాం
- పదేళ్లలో కొడంగల్‌కు ఎన్ని ఇచ్చారో చర్చ పెడదామా!
- సిద్దిపేటలో గెలిచే కాంగ్రెస్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి
- రైతులు వరే కాదు.. అన్ని పంటలనూ సాగుచేయాలి
- 50 లక్షల టన్నులకు మించి ధాన్యాన్ని కేంద్రం కొనట్లేదు
- తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు పంపవద్దు
- ప్రభుత్వ పాఠశాలల్లోనే నిష్ణాతులైన టీచర్లున్నారు
- రామగుండం ఎరువులను పూర్తిగా తెలంగాణ
- రైతులే వినియోగించుకునే అవకాశం ఇవ్వాలి




- నర్మెట్టలో పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభంలో సీఎం రేవంత్

సిద్దిపేట, మార్చి 22 (మెట్రో ఉదయం)ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలపై తనకు ఎలాంటి వివక్షా లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలను సమాన దృష్టితో చూస్తానన్నారు. వివక్ష గురించి మాట్లాడాలంటే ఆనాడు కొడంగల్‌కు ఎన్ని నిధులిచ్చారో, తాము అధికారంలోకి వచ్చాక గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లకు ఎన్ని నిధులిచ్చామో చర్చిద్దాం రావాలని బీఆర్ఎ?సకు సవాల్ చేశారు. "పదేళ్ల ప్రజలు మీకు

➢ మిగతా 2వ పేజిలో..



## ఫ్యూచర్‌సిటీ నుంచి బందరు పోర్టుకు12 లేన్ల కొత్త హైవే ఇవ్వండి

- ఎన్‌హెచ్-65 విస్తరణతో లింకు పెట్టొద్దు
- తెలంగాణ లేఖ.. పరిశీలిస్తామన్న కేంద్రం

హైదరాబాద్, మార్చి 22 తెలంగాణలోని భారత్ ఫ్యూచర్‌సిటీ నుంచి ఏపీలోని బందరు పోర్టు వరకూ ప్రతిపాదించిన 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవేపై కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల మధ్య లేఖల పరంపర నడుస్తోంది. ఈ రోడ్డు అవసరం లేదన్న భావన స్ఫురించేలా ఇటీవల కేంద్రం.. రాష్ట్రానికి లేఖ రాయగా, ఆ రోడ్డు ఆవశ్యకతను తెలుపుతూ తెలంగాణ ప్రభుత్వం తాజాగా కేంద్రానికి లేఖ రాసింది. హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును ఆరు లేన్ల రహదారిగా విస్తరిస్తున్నామని, తద్వారా ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లో ఇచ్చిన హామీని నెరవేర్చినట్టేనని రాష్ట్రానికి రాసిన లేఖలో కేంద్రం పేర్కొంది. ఆ లేఖలో పేర్కొన్న

➢ మిగతా 2వ పేజిలో..

## నేటి నుంచి 'వాహన్' సేవలు



- ప్రారంభించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్
- కేంద్రం పరిధిలోని పరివాహన్ పోర్టల్‌లోకి రాష్ట్ర వాహనాల డేటా బదిలీ
- యజమాని పేరు, చిరునామా మార్పు ఇక ఆన్‌లైన్‌లోనే.. డూప్లికేట్ ఆర్‌సీ కూడా

హైదరాబాద్ సిటీ, మార్చి 22 (మెట్రో ఉదయం) వాహనదారులు కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండా పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర రవాణా శాఖ కసరత్తు ముమ్మరం చేసింది. సోమవారం నుంచి కేంద్ర రోడ్డు రవాణా, హైవేస్ మంత్రిత్వ శాఖ పరిధిలోని వాహన్ సేవలను వినియోగంలోకి తేనుంది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ

➢ మిగతా 2వ పేజిలో..




## శత్రువులకు నో ఎంట్రీ..

**ట్రంప్ 48 గంటల డెడ్‌లైన్‌పై స్పందించిన ఇరాన్**

టెహ్రాన్, మార్చి 22: పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఆయిల్, గ్యాస్ కష్టాలు తీవ్రతరం అయ్యాయి. హోర్ముజ్ జలసంధిలో రాకపోకలు పాక్షికంగా దెబ్బతినటంతో క్రూడ్ ఆయిల్ సంక్షోభం నెలకొంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హోర్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్‌కు 48 గంటల డెడ్‌లైన్ ఇచ్చారు. ఈ డెడ్‌లైన్‌పై ఇరాన్

➢ మిగతా 2వ పేజిలో..

## మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదు

- కానీ.. పేదల ఇళ్లు కూలిస్తే ఊరుకోం.. బఫర్ జోన్ పేరుతో ప్రజలను బహిష్కరించొద్దు
- మూసీని వికారాబాద్ నుంచి చివరిదాకా ప్రక్షాళన చేయాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు
- పునరుజ్జీవ ప్రణాళికలో శాస్త్రీయత లేదు
- తప్పులతడకగా డీపీఆర్
- కేంద్ర జల వనరుల శాఖ మాజీ సలహాదారు వెదిరె శ్రీరామ్



హైదరాబాద్, మార్చి 22(మెట్రో ఉదయం) మూసీ నది ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని, కానీ దాని పేరుతో పేదల ఇళ్లు కూలిస్తే మాత్రం ఊరుకోబోమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 10 వేల ఇళ్లు కూల్చుతామంటే, మరోవైపు ఓ మంత్రి 1,400 ఇళ్లు మాత్రమేనని అసెంబ్లీలో అంటున్నారని, అసలు నిజం ఏదీ? ప్రజలు ఎవర్ని నమ్మాలని ప్రశ్నించారు. నార్సింగి ప్రాంతంలో పెద్ద నిర్మాణాలకు బఫర్ జోన్ వర్తించకపోతే, మధు పార్కు రిడ్జ్ వంటి భవనాలకు ఎలా వర్తిస్తోందన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో 'మూసీ నది పునరుజ్జీవం-వాస్తవాలు' అనే అంశంపై ఆదివారం బేగంపేటలోని ఓ హోటల్‌లో మహారాష్ట్ర సీఎం సలహాదారు, కేంద్ర జల వనరుల శాఖ మాజీ సలహాదారు వెదిరె శ్రీరామ్ శ్రీరామ్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ ఎక్కడైనా ప్రాజెక్టులు చేపడితే ముందుగా నష్టపోయేవారికి పరిహారం అందిస్తారని, కానీ ఇక్కడ

➢ మిగతా 2వ పేజిలో..



## 30 నుంచి తిరుమలలో వసంతోత్సవాలు

అమరావతి,మార్చి 22 (మెట్రో ఉదయం)తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 30వ తేదీ నుంచి మూడురోజుల పాటు వసంతోత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా 30న ఉదయం 6.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్ప స్వామి నాలుగు మాడవీధుల్లో

➢ మిగతా 2వ పేజిలో..

# శత్రువులకు నో ఎంట్రీ..

➢ మొదటి పేజీ తరువాయి

ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ.. 'మా శత్రుదేశాలకు మాత్రమే హోర్ముజ్ జలసంధిని మూసి వేశాము. మిగిలిన దేశాలు హోర్ముజ్ మీదుగా వెళ్లాలంటే భద్రతపై ఇరాన్ అధికారులను సంప్రదించవచ్చు' అని అన్నారు.ఇంతకీ ట్రంప్ ఎమన్నారంటే.. హోర్ముజ్ జలసంధిని 48 గంటల్లోగా పునరుద్ధరించాలని, లేదంటే ఇరాన్ విద్యుత్ కేంద్రాలను నేలమట్టం చేస్తామని ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. అతిపెద్ద కేంద్రం నుంచే ఈ దాడులు మొదలవుతాయని ట్రంప్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన తన సొంత సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ 'ది ట్రూత్'లో శనివారం ఓ పోస్టు పెట్టారు.

### ఎఫ్ 15 ఫైటర్ జెట్‌ను కూల్చేసిన ఇరాన్

హోర్ముజ్ ఐల్యాండ్‌లో శత్రువులకు సంబంధించిన ఎఫ్ 15 ఫైటర్ జెట్‌ను కూల్చేశామని ఇరాన్ తెలిపింది. ఆదివారం టెహ్రాన్ టైమ్స్ ఇందుకు సంబంధించిన ఓ వీడియోను ఎక్స్ ఖాతాలో విడుదల చేసింది. 29 సెకన్ల ఆ వీడియోలో ఇరాన్ దళాలు హోర్ముజ్ ఐల్యాండ్‌పై ఎఫ్ 15 ఫైటర్ జెట్‌ను గుర్తించి పేల్చిసిన దృశ్యాలు ఉన్నాయి. అయితే, ఆ ఫైటర్ జెట్ అమెరికాకు చెందినది లేదా ఇజ్రాయెల్‌కు చెందినదా అన్నది తెలియరాలేదు. ఇరాన్ కూడా దీనిపై క్లారిటీ ఇవ్వలేదు.

# 30 నుంచి తిరుమలలో వసంతోత్సవాలు

➢ మొదటి పేజీ తరువాయి

ఊరేగుతారు. అనంతరం వసంతోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ వసంతోత్సవ అభిషేకం, నివేదనలు పూర్తయ్యాక తిరిగి ఆలయానికి చేరుకుంటారు. రెండో రోజున మలయప్పస్వామి ఉదయం 8 నుంచి 10 గంటలకు వరకు బంగారు రథాన్ని అధిరోహించి, తిరుమాడవీధుల్లో ఊరేగుతారు. తర్వాత వసంత మండపంలో అర్చకులు వసంతోత్సవాన్ని నిర్వహిస్తారు. చివరిరోజు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామితో పాటు సీతారామ లక్ష్మణ ఆంజనేయ సమేత ఉత్సవర్లు, రుక్మిణి సమేత శ్రీకృష్ణ స్వామి దర్శనమివ్వనున్నారు. ఈసందర్భంగా ప్రతి రోజూ మ?ధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు తిరుమంజనం నిర్వహించనున్నారు. మార్చి 30 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీవరకు కల్యాణోత్సవం, ఊంజల్, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకారసేవ, మార్చి 31న అష్టదళపాద పద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది.

# జైళ్ల సామర్థ్యం ఎంత? ఖైదీలు ఎంత మంది?

- **దేశంలో జైళ్ల పరిస్థితిపై సుప్రీంకోర్టు ఆందోళన**

న్యూఢిల్లీ, మార్చి 22( (మెట్రో ఉదయం) దేశవ్యాప్తం గా కిక్కిరిసిన జైళ్ల తీరుపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. జైళ్ల సామర్థ్యం ఎంత?, ఖైదీలు ఎంతమంది ఉన్నారు? జైళ్లలో ఖాళీగా ఉన్న పోస్టులు ఎందుకు భర్తీ చేయడం లేదు? అంటూ ప్రశ్నించింది. జైళ్లు సంస్కరణకు నిలయాలుగా ఉండాలే తప్ప నరకకూపాలుగా మారకూడదంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. జైళ్లలో స్థితిగతులపై దాఖలైన పిటిషన్‌ను సుమోటోగా విచారించిన ద్విసభ్య ధర్మాసనం కేంద్రంతోపాటు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు శనివారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది మార్చి 1 వరకూ జైళ్లలోని ఖైదీల సంఖ్య, జైళ్ల సామర్థ్యం, రద్దీని తగ్గించేందుకు తీసుకుంటున్న చర్యలపై మే 18లోగా సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. అలాగే, జైళ్లలో మహిళా ఖైదీలతోపాటు ఉంటున్న చిన్నారుల దుస్థితిపై ధర్మాసనం కలత చెందింది. ఆ చిన్నారులకు అందుతున్న విద్యా సౌకర్యాలు, వైద్య సదుపాయాలపై స్పష్టత ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను మే 26కు వాయిదా వేసింది.

# ఫ్యూచర్‌సిటీ నుంచి బందరు పోర్టుకు12 లేన్ల కొత్త హైవే ఇవ్వండి

మొదటి పేజీ తరువాయి

ప్రతి విషయానికీ రాష్ట్రం సమాధానం ఇచ్చింది. ఫ్యూచర్‌సిటీ నుంచి బందరు పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవేను మంజూరు చేయాలని మరోసారి కోరింది. హైదరాబాద్–మచిలీపట్నం పోర్టు వరకు చేయబోయే 6 లేన్ల విస్తరణ పనులకు.. ఫ్యూచర్‌సిటీ–బందరు పోర్టు కొత్త రోడ్డుకు లింకు పెట్టొద్దని విజ్ఞప్తి చేసింది. ఇది రెండు రాజధానులు, ఆ మధ్యలోని కొత్త ప్రాంతాలను కలిపే మార్గమని స్పష్టం చేసింది.

లేఖలో ఏముందంటే..

"పునర్వ్యవస్థీకరణ చట్టం – 2014 ప్రకారం పెండింగ్ సమస్యలపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి అధ్యక్షతన 03.02.2025న జరిగిన సమావేశంలోనూ హైస్పీడ్ అమరావతి–హైదరాబాద్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే కోసం డీపీఆర్ సిద్ధం చేయాలని కేంద్ర్వాన్ని ఏపీ కోరింది. ఇదే అంశంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి 09.09.2025న భేటీ అయ్యారు. హైదరాబాద్ నుంచి అమరావతి వరకూ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే కోసం డీపీఆర్ సిద్ధం చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే, హైదరాబాద్‌లోని ముచ్చర్ల సమీపంలో ఉన్న భారత్ ఫ్యూచర్ సిటీ వద్ద ప్రారంభమై, అమరావతి మీదుగా బందరు పోర్ట్ సమీపంలో 297.82 కిలోమీటర్ వద్ద ముగిసేలా తాత్కాలిక అలైన్‌మెంట్‌ను సమర్పించాం. ఈ గ్రీన్‌ఫీల్డ్ రహదారి పొడవు తెలంగాణలో 118 కిలోమీటర్లు, ఏపీలో 179 కి.మీ. ఉంటుంది. దీనికోసం డీపీఆర్ కన్సల్టెంట్‌ను నియమించాలని, ఫ్యూచర్ సిటీ బందర్ పోర్ట్ వరకు 12 లేన్ల (120 మీటర్ల వెడల్పు – ఆర్వోడబ్ల్యూ) గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశాం. హైదరాబాద్ సమీపంలో ప్రతిపాదించిన మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్ (డ్రై పోర్ట్)ను బందర్ పోర్ట్‌తో అనుసంధానించే ఎక్స్‌ప్రెస్ వే అవసరం ఎంతైనా ఉంది. 'తెలంగాణ రైజింగ్ విజన్–2047' డాక్యుమెంట్‌లోనూ ఈ ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్ట్ ఒక భాగమే.కేంద్రం ఎన్‌హెచ్–65లోని ప్రస్తుత 4 లేన్ల హైదరాబాద్–విజయవాడ – మచిలీపట్నం సెక్షన్‌ను మరేదైనా ప్రోగ్రామ్ లేదా నిధుల కింద 6 లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ కారిడార్‌గా అప్‌గ్రేడ్ చేయవచ్చు. అయితే, ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం – 2014 నిబంధనల కింద మాత్రం కాదు. అందుకే, ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 కింద ఇప్పటికే సమర్పించిన అలైన్‌మెంట్ ప్రతిపాదనల ప్రకారం, హైదరాబాద్ (భారత్ ఫ్యూచర్ సిటీ) నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్ట్ వరకు 12 లేన్ల (120 మీటర్ల రైట్ ఆఫ్ వే) గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేను మంజూరు చేయవలసిందిగా మరోసారి కోరుతున్నాం." అని కేంద్రానికి రాసిన లేఖలో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. కాగా, రాష్ట్ర ప్రభుత్వం రాసిన లేఖలోని విజ్ఞప్తులను.. పరిశీలిస్తామని కేంద్రం మౌఖికంగా చెప్పినట్టు సమాచారం.

# 2029లోనూ అధికారం మాదే..

మొదటి పేజీ తరువాయి

అవకాశం ఇచ్చారు. పదేళ్లు మమ్మల్ని ఆశీర్వదిస్తారు. ఎవరు అడ్డుకున్నా ఆగదు. 2029లో మళ్లీ మాదే అధికారం" అని ప్రకటించారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నర్మెట్టలో రూ.300 కోట్లతో నిర్మించిన పామాయిల్ కర్మాగారాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. దీంతోపాటు రూ.50 కోట్లతో ఏర్పాటు చేయనున్న రిఫైనరీ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామన్నారు. ఈ నియోజకవర్గంలో ఒకే కుటుంబం వారికి అవకాశం కల్పిస్తున్నారని, మార్పు చేస్తే మంచి జరుగుతుందో లేదో చూడండని ప్రజలకు సూచించారు. వచ్చే ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేను గెలిపించే బాధ్యతను మంత్రులు దామోదర రాజనర్సింహకు, వివేక్‌కు అప్పగిస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేటపై తమకు ఎలాంటి వివక్ష లేదని, అధికారులు కూడా నిధుల విషయంలో పూర్తిగా సహకరించాలని అన్నారు. వివక్ష ఉంటే ఇక్కడ పామాయిల్ ఫ్యాక్టరీని కట్టించేవాళ్లం కాదని, దానిని కొడంగల్‌కు తీసుకెళ్లేవాడినని చెప్పారు. ఇక్కడున్న ఎమ్మెల్యే కోసం ఫ్యాక్టరీ కట్టలేదని, రైతుల కోసం నిర్మించామని స్పష్టం చేశారు.

### రైతు ఏడ్చిన రాజ్యం బాగుండదు..

ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం సుభిక్షంగా ఉండలేవని సీఎం రేవంత్ అన్నారు. రైతు కళ్లలో ఆనందం చూడాలన్నదే తన తపన అని చెప్పారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే 28 నెలల్లోనే రూ.లక్షా 40 వేల కోట్ల నిధులను రైతుల కోసం ఖర్చు చేశామని తెలిపారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం రైతుల కోసం ప్రతినెలా రూ.2,533 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే.. తాము 28నెలల్లో ప్రతినెలా రూ.5500 కోట్ల చొప్పున రైతు సంక్షేమం కోసం వెచ్చించామని వివరించారు. దేశంలోనే అత్యధికంగా వరి పంట పండించే రాష్ట్రంగా తెలంగాణ అగ్రస్థానంలో ఉందని సీఎం పేర్కొన్నారు. కానీ, వరిపంట సాగు చేయడం వల్ల రైతులకు ఆశించిన లాభాలు ఉండవని, పంట మార్పిడి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. వరి ఒక్కటే కాకుండా అన్ని రకాల పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహిస్తామన్నారు. రైతులు పండించే ప్రత్యామ్నాయ పంటలకు కేంద్రం సహకారం అందించాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలో 3లక్షల ఎకరాల్లో పామాయిల్ పంట సాగు చేస్తున్నారని, దీనిని 10లక్షల ఎకరాలకు తీసుకెళ్తామని ప్రకటించారు. ఇతర దేశాల నుంచి నిత్యావసరాలను దిగుమతి చేసుకునే పరిస్థితి లేకుండా ఇక్కడి అవసరాలను ఇక్కడే తీర్చుకునేలా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టాలన్నారు. 'ప్రతి పంటనూ లాభసాటిగా మార్చడమేబంగారు తెలంగాణ' అని అన్నారు.

### అంకాపూర్ రైతులే ఆదర్శం..

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు తమ ప్రభుత్వానికి అంకాపూర్ గ్రామ రైతులే ఆదర్శమని సీఎం అన్నారు. అక్కడి రైతులు మిగిలిన వారికి విభిన్నంగా పసుపు పండించి ఆర్థికంగా బలోపేతమయ్యారని చెప్పారు. ఇక రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల్లో 67 లక్షల మంది మహిళలు ఉన్నారని, వీరి సంఖ్యను కోటికి పెంచేలా కృషి చేస్తామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. మహిళలు ఆర్థికంగా నిలబడాలని, వారి కోసం ఎక్కడి నుంచైనా నిధులు తెస్తానని, ఇప్పటికే రూ.57 వేల కోట్ల రుణాలు ఇచ్చామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలను ప్రక్షాళన చేస్తున్నామని సీఎం తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచే తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపించి ఆర్థికంగా నష్టపోవద్దని, నిష్ణాతులైన ఉపాధ్యాయులంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నారని చెప్పారు. ఇంజనీరింగ్, డాక్టర్ చదువుల కంటే పాలిటెక్నిక్, ఐటీఐ చదివిన వారికి ఉద్యోగాలు త్వరగా వస్తున్నాయని, అందుకే అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి నైపుణ్య బోధన చేయిస్తున్నామని వివరించారు.

### ఎరువుల కొరత రావొచ్చు

దేశాల మధ్య జరిగే యుద్ధం వల్ల యూరియా, ఎరువుల కొరత వచ్చే ప్రమాదం ఉందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. అందుకే రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలోని ఎరువులను పూర్తిగా తెలంగాణలోని రైతులకే వినియోగించుకునేలా కేంద్రం ప్రకటన చేయాలని కోరారు. ఈ విషయంలో రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రుల సహకారం అవసరమన్నారు. వారు ప్రధాని మోదీని కలిసి దీనిపై చర్చించాలన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు ఉండాలని, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం విషయాల్లో సమన్వయంగా ఉంటేనే ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని పెద్దరైతు పాలిస్తున్నారని వ్యాఖ్యానించారు. రైతుల కష్టాలు తెలిసిన వ్యక్తిగా, రైతు బిడ్డగా, రైతుల కళ్లలో ఆనందం కోసమే రేవంత్‌రెడ్డి తపిస్తుంటారని చెప్పారు. కొంతమంది అధికారం కోసం గోతికాడి నక్కల్లా చూస్తున్నారని, వారికి రైతులే తగిన బుద్ధి చెబుతారన్నారు. యూరియా కొరత సమయంలో రైతుల బాధలు, వారి చెప్పులు చూసి సంతోషపడిన ఘనత ప్రతిపక్ష పార్టీలదని ఎద్దేవా చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివ?సరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కారుకూతలు మానుకోవాలన్నారు. తెల్లకాగితాన్ని నల్లగా మార్చడం తప్ప పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణంలో బీఆర్ఎస్ పాత్ర ఏమీ లేదన్నారు.

### శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు

సిద్దిపేట కలెక్టరేట్/నంగునూరు: నర్మెట్టలోని పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఈ సందర్భంగా రూ.141.34 కోట్లతో సిద్దిపేట మునిసిపాలిటీలో నీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అంబేద్కర్ నగర్‌లో రూ.1.43 కోట్లతో నిర్మించిన యూపీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభించారు. ఎన్సాన్‌పల్లిలో రూ.78 కోట్లతో నిర్మించిన జిల్లా జైలు భవనం, రూ.15 కోట్లతో 50 పడకల సమీకృత ఆయుష్ ఆస్పత్రి, రూ.3.60 కోట్లతో సెంట్రల్ మెడిసిన్ స్టోర్‌ను, నంగునూరు మండలం గట్లమల్యాలలో రూ.1.43 కోట్లతో పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభించారు. గజ్వేల్ నియోజకవర్గం కొండపాకలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌కు, రూ.16.62 కోట్లతో మర్కూక్‌లోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో అదనపు మౌలిక సదుపాయాలకు, రూ.8.65 కోట్లతో సమీకృత మండల కార్యాలయాల సముదాయానికి శంకుస్థాపన చేశారు. రూ.9.65 కోట్లతో జగదేవ్‌పూర్‌లో సమీకృత మండల కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభించారు.

# నేటి నుంచి 'వాహన్' సేవలు

➢ మొదటి పేజీ తరువాయి

సేవలను ప్రారంభించనున్నారు. మొదటివిడతగా కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే వాహనాలకు ఈ సదుపాయం కల్పించనున్నారు. ముమ్ముందు పాత వాహనాలకు సంబంధించిన సేవలూ కేంద్ర మంత్రిత్వ శాఖకు చెందిన పరివాహన్ పోర్టల్ ద్వారా అందనున్నాయి. వాహన్ సేవలు అందుబాటులోకి వస్తే వాహన యజమాన్య మార్పు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్(ఆర్‌సీ)పై చిరునామా మార్పు, డూప్లికేట్ ఆర్‌సీ, రవాణా వాహనాలకు సంబంధించిన రుసుము, పన్నులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించే అవకాశం ఉంటుంది. మొబైల్ నంబర్‌నూ ఆన్‌లైన్‌లోనే మార్చుకోవచ్చు. ఇతర రాష్ట్రాలకు మారినప్పుడు వాహనాల రిజిస్ట్రేషన్ మార్చుకునేందుకు నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) అవసరం ఉండదని అధికారులు చెబుతున్నారు. నేషనల్ పర్మిట్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సేవలూ ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయి. ఆటోమెటిక్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్లలో వాహనాన్ని పరిశీలించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఇప్పటికే రాష్ట్రంలోని వాహనాల డేటా పరివాహన్ పోర్టల్‌లోకి బదిలీ అయిందని, దశల వారీగా పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి తెస్తామని ఓఅధికారి తెలిపారు. ఇక రాష్ట్రంలో సారథి సేవలు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. గతంలో సికింద్రాబాద్ తిరుమలగిరి ఆర్‌టీఏ కార్యాలయంలో పైలట్ ప్రతిపాదికన ఈ సేవలు ప్రారంభించారు. సక్సెస్ కావడం తో రాష్ట్రమంతా వినియోగంలోకి వచ్చాయి. లెర్నర్, డ్రైవిం గ్ లైసెన్సులు, డ్రైవింగ్ స్కూళ్ల అనుమతి జారీ వంటివి పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి.

# మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదు

➢ మొదటి పేజీ తరువాయి

'ముందు కూల్చి, తర్వాత ఇస్తా'మనే అన్యాయమైన విధానం కనిపిస్తోందన్నారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు మొదట రూ.5 వేల కోట్లు అవుతుందని చెప్పి, కొన్ని రోజుల్లోనే రూ.7 వేల కోట్లకు పెంచారని ఆరోపించారు. మూసీ పునరుజ్జీవం కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాదన్నారు. మూసీ వికారాబాద్ జిల్లాలో ప్రారంభమై నల్గొండ, సూర్యాపేట జిల్లాల గుండా ప్రవహించి కృష్ణా నదిలో కలుస్తుందని, నది పుట్టుక నుంచి చివరి వరకు ప్రక్షాళన చేయాలని సూచించారు.

ఇది ఒక ప్రాజెక్ట్ మాత్ర మే కాదని, మన భవిష్యత్తుకు పెట్టుబడి అన్నారు. మన ఆరోగ్యానికి, రైతుల జీవనానికి, తెలంగాణ అభివృద్ధికి అత్యవసరమని చెప్పారు. అమెరికాలోని షికాగో నగరంలో సరస్సులు, న్యూయార్క్–న్యూజెర్సీ మధ్య ప్రవహించే నదులు, ఇంగ్లండ్‌లో మాంచెస్టర్ ప్రాంతంలోని నదులు, లండన్‌లోని థేమ్స్, పారి?సలోని సీన్ వంటి నదుల పక్కనే అభివృద్ధి జరిగిందని, వాటి పక్క నే భవనాలు ఉన్నాయని, పర్యాటక కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. అక్కడ బఫర్ జోన్ పేరుతో ప్రజలను బహిష్కరించలేదని చెప్పారు. రాష్ట్రంలో పెన్షన్లు, రైతు భరోసాకు డబ్బులు లేవంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు లక్షల కోట్లు ఖర్చు చేస్తామని చెబుతోందని, అంత భారీ మొత్తాన్ని ఎక్కడ్నుంచి తెస్తుందని ప్రశ్నించారు. వెదిరె శ్రీరామ్ మాట్లాడుతూ మూసీ పునరుజ్జీవం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికల్లో శాస్త్రీయ దృష్టికోణం లేదని విమర్శించారు. జీవం లేని నదిపై అలంకరణ చేయడంతో ప్రయోజనం ఉండదని, ముందుగా నది ఆరోగ్యాన్ని పునరుద్ధరించాలని సూచించారు. నదిలో చేపలు జీవించి, నీటి నాణ్యత మెరుగుపడినప్పుడే మూసీ పునరుజ్జీవం సాధ్యమవుతుందన్నారు. ఇది కేవలం అభివృద్ధి ప్రాజెక్ట్ కాదని, ఒక సమగ్ర పర్యావరణ, సామాజిక, శాస్త్రీయ ప్రక్రియ అన్నారు. అది విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, నమామి గంగే, సబర్మతి వంటి ప్రాజెక్టుల్లో మాదిరిగా కాలనీ, వార్డు స్థాయిలో ప్రజలు, నిపుణులు, సంస్థలతో విస్తృత చర్చలు జరపాలని సూచించారు. మూసీ పునరుజ్జీవానికి ప్రభుత్వం ఇచ్చిన డీపీఆర్ తప్పులతడకగా ఉందని, పలు అంశాలపై స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) నిర్దేశించిన మార్గదర్శకాలు పాటించలేదని చెప్పారు.

తక్కువ ఖర్చుతో మూసీ పునరుజ్జీవానికి డీపీఆర్‌ను ప్రభుత్వానికి ఉచితంగా అందించేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వాలు మారినా ప్రాజెక్టు ఆగకుండా ముందుకెళ్లేలా 3 దశల్లో సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో 10–15 శాతం ప్రభుత్వ స్థలాలను రియల్ ఎస్టేట్ సంస్థలకు ఇస్తే ప్రభుత్వంపై రూపాయి భారం పడకుండా ప్రాజెక్టు పూర్తిచేయవచ్చని చెప్పారు. దేశంలోని పలు రాష్ట్రాలు ఇదేవిధానం అవలంబిస్తున్నాయన్నారు. మూసీ చుట్టూ గోడలు కడితే భారీ వర్షాలు పడినప్పుడు నీరు ఎక్కడికి పోతుందని ప్రశ్నించారు. చిన్నవాగులను పునరుద్ధరించకుండా ప్రధాననది పునరుజ్జీవం అసాధ్యమన్నారు. మూసీ మొత్తం పరివాహక ప్రాంతాన్ని ఒకే వ్యవస్థ కింద నిర్వహించడానికి 'మూసీ రివర్ బేసిన్ అథారిటీ' ఏర్పాటు చేయాలని, సమగ్ర బేసిన్ ప్లాన్ ఉండాలన్నారు. నీటి నాణ్యతపై బీఏడీ, డీఓ వంటి పరామితులను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు.

## మహా చక్రవర్తి శాలివాహన.!

- గూడూరులో ఘనంగా జయంతి వేడుకలు.



ఉదయం, పాలకుర్తి ప్రతినిధి : (కమ్మగాని రమేష్ గౌడ్, సీనియర్ జర్నలిస్టు,)

తొలి తెలుగు మహా చక్రవర్తి, అఖండ భారతదేశాన్ని ఏలిన శాలివాహన శకం సృష్టికర్త శ్రీ శాలివాహన ప్రజాపతి మహారాజ్ 1948వ జయంతి వేడుకలను జనగాం జిల్లా పాలకుర్తి మండలం గూడూరు గ్రామంలో అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆయన ఆశయాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాలివాహన సంఘం గౌరవ అధ్యక్షుడు రాజారావు ఎల్లయ్య ప్రజాపతి, అధ్యక్షుడు నాంపల్లి భగత్ కుమార్, ప్రజాపతి, ఉప్పునూతుల రమేష్, ప్రజాపతి,యాదగిరి ప్రజాపతి, స్వామి ప్రజాపతి, పుల్లయ్య ప్రజాపతి, రాజు ప్రజాపతి, వెంకటేష్ ప్రజాపతి, నర్సయ్య ప్రజాపతి, రక్షిత్ ప్రజాపతి తదితరులు పాల్గొన్నారు.

## బీసీల సమగ్రాభివృద్ధికి కొత్త పథకాన్ని ప్రవేశపెట్టకపోవడం విడ్డూరం....

- బిఆర్ఎస్ నాయకుడు భీమాగౌని కృష్ణాగౌడ్



అంబర్ పేట్, మార్చి 22 (మెట్రో ఉదయం): ప్రభుత్వం బడ్జెట్లో బీసీలకు నిధుల కేటాయింపులో తీరని అన్యాయం చేసిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు భీమాగౌని కృష్ణాగౌడ్ ఆరోపించారు. శనివారం జమాల్బస్తీలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్లో బీసీలకు ప్రతియేట రూ. 20 వేల కోట్లు కేటాయిస్తామని హామి ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ. 12.511 కోట్లు కేటాయించి చేతులు దులుపుకుందని ద్వజమెత్తారు. బీసీల సమగ్రాభివృద్ధికి కొత్త పథకాన్ని కూడ ప్రవేశపెట్టకపోవడం విడ్డూరకరమని ఆరోపించారు. ఆర్థికమంత్రి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారెడి తప్ప, బీసీలకు ఇచ్చింది. ఏమిలేదని ద్వజమెత్తారు. విద్యార్థుల స్కాలర్షిప్ల కోసం రూ. 5 వేల కోట్లు కావాల్సి ఉండగా కేవలం రూ. 100 కోట్లు చెల్లించారన్నారు.


## ఇందిరానగర్ వాసుల తాగునీటి కష్టాలకు విముక్తి

- ఎన్నికల హామీని నెరవేర్చిన కౌన్సిలర్ బత్తుల నరేష్
- బోరు బావిని ప్రారంభించిన జువ్వాడి కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ లింబాద్రి



మెట్పల్లి మార్చి 22 (మెట్రో ఉదయం ప్రతినిధి): పట్టణంలోని 3వ వార్డు ఇందిరానగర్ కాలనీలో దీర్ఘకాలంగా నెలకొన్న తాగునీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఎన్నికల సమయంలో కాలనీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు స్థానిక కౌన్సిలర్ బత్తుల నరేష్ స్వయంగా చొరవ తీసుకుని కొత్తగా బోరు బావిని ఏర్పాటు చేయించారు. ఈ బోరు బావిని ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రిలతో కలిసి ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజల అవసరాలను గుర్తించి తక్షణమే స్పందించిన కౌన్సిలర్ నరేష్ను అభినందించారు. కాలనీ వాసుల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా ఈ బోరు బావిని అందుబాటులోకి తెచ్చినట్లు వారు పేర్కొన్నారు. తమ వార్డులో నీటి ఎద్దడిని తీర్చడానికి కౌన్సిలర్ తీసుకున్న నిర్ణయం పట్ల ఇందిరానగర్ మహిళలు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి హర్షం వ్యక్తం చేశారు. గతంలో నీటి కోసం పడిన ఇబ్బందులు ఇకపై ఉండవని వారు సంతోషం వ్యక్తం చేస్తూ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీ పెద్దలు, యువజన సంఘాల సభ్యులు మరియు భారీ సంఖ్యలో కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన బికేఆర్..



కుత్బుల్లాపూర్ మార్చి 22 (ఉదయం ప్రతినిధి): కుత్బుల్లా పూర్ నియోజక వర్గంలోని గాగిల్లాపూర్ దుండిగల్ బహదూర్ పల్లి బరంపేట్ ఇందిరమ్మ కాలనీ సాయిబాబా నగర్ అపురూప కాలనీ షాపూర్ నగర్ ముస్లిం మైనార్టీ సోదరుల ఆహ్వానం మేరకు రంజాన్ వేడుకల్లో పాల్గొన్న బికేఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో కఠినమైన ఉపవాస దీక్షలు ముగించుకొని ప్రేమ, శాంతి పరస్పర సహకారం ఐక్యమత్యంతో పవిత్రమైన రంజాన్ పండుగ జరుపుకుంటున్న ముస్లిం సోదర, సోదరీమణులందరికీ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం,వెలుగులు నింపి అష్టైశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని ఆ భగవంతుని కోరుకుంటున్నానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ కావలి గణేష్, ఏఆర్.సాధు యాదవ్, గజేంద్ర, నర్సింహారెడ్డి, బైబడి సంతోష్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు ప్రజా ప్రతినిధులకు ఘన సన్మానం



మెట్పల్లి మార్చి 22 (మెట్రో ఉదయం ప్రతినిధి): మెట్పల్లి పట్టణంలోని విదిత్ రెడ్డి గార్డెన్స్లో కోరుట్ల నియోజకవర్గ పటేల్స్ యూత్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మున్నూరు కాపు ప్రజా ప్రతినిధులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్నూరు కాపు రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్, జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్ దావా వసంత సురేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సుప్రీంకోర్టు న్యాయవాది కొమిరెడ్డి విజయ్ ఆజాద్, డాక్టర్ జెఎన్ వెంకట్, పిల్లల వైద్య నిపుణులు జె. గంగాసాగర్, జిల్లా అధ్యక్షుడు వద్నాల రాజశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొమిరెడ్డి విజయ్ ఆజాద్ మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో ఎన్నికైన మున్నూరు కాపు ప్రజా ప్రతినిధులు సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సమాజ ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజా సేవలో ముందుండాలని ఆకాంక్షించారు. పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గంగాసాగర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు మెంబర్లు, ఉపసర్పంచులు, కౌన్సిలర్లు, చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల అభివృద్ధి, వార్డుల అభివృద్ధితో పాటు గ్రామాలలోకి కొత్తగా వచ్చే వ్యక్తులపై కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే యువత గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా తగు చర్యలు తీసుకుని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జె.ఎన్. వెంకట్, డాక్టర్ పుప్పాల సాగర్ పటేల్, డాక్టర్ సంధ్యారాణి పటేల్, మెట్పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, కౌన్సిలర్లు మాసుల ప్రవీణ్, నునుగొండ నరేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, చెదలు సత్యనారాయణ, మార్గం నరేష్, ఒజ్జెల శ్రీనివాస్, పుప్పాల నాగేష్, నోముల రమేష్, ఎశమేని గణేష్, జెట్టి రూపేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రెస్ కాలనీలో శ్రీ చైత్ర హైస్కూల్ నూతన బ్రాంచ్ ప్రారంభం



- తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్య లక్ష్యం: నిర్వాహకులు

ఎల్ బీ నగర్, మెట్రో ఉదయం, ప్రతినిధి,మార్చి 22: ప్రాంతీయ విద్యా రంగంలో మరో కీలక అడుగు ముందుకు పడింది. శ్రీ చైత్ర హైస్కూల్ నూతన బ్రాంచ్ను ఆదివారం చంపాపేట్ ప్రెస్ కాలనీ లో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజల సమక్షంలో ఉత్సాహభరితంగా జరిగింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఐఎస్ సదన్ డివిజన్ తాజా,మాజీ కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి, సైదాబాద్ డివిజన్ తాజా,మాజీ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఘనంగా నూతన బ్రాంచ్ను ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులతో కలిసి స్కూల్ను పరిశీలించి, విద్యా సదుపాయాలను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండటం అత్యంత అవసరమని తెలిపారు. ముఖ్యంగా మధ్య తరగతి, పేద కుటుంబాలకు తక్కువ ఫీజులతో ఉత్తమ విద్యను అందించడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని పేర్కొన్నారు.

ఈ దిశగా శ్రీ చైత్ర హైస్కూల్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. శ్రీ చైత్ర స్కూల్ తక్కువ కాలంలోనే మంచి పేరు సంపాదించుకుని, తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తూ సామాన్య ప్రజలకు చేరువైన విద్యాసంస్థగా ఎదిగిందని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తూ దినదినాభివృద్ధి సాధిస్తున్న ఈ విద్యాసంస్థ ప్రెస్ కాలనీలో మరో బ్రాంచ్ను ప్రారంభించడం ఆనందదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్, మానేజింగ్ డైరెక్టర్ అక్షయ్ కుమార్, డైరెక్టర్ శిరీష, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా నిర్వాహకులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



# రాముల వారి కళ్యాణం ఘనంగా నిర్వహించాలి..!

- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగదు.
- ఆలయంలో సౌకర్యాలు కల్పించాలి.
- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి.



ఉదయం, పాలకుర్తి ప్రతినిధి: (కమ్మగాని రమేష్ గౌడ్, సీనియర్ జర్నలిస్టు ).

శ్రీరామనవమిని పురస్కరించుకొని పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వల్మీడి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అధికారులతో పాటు నూతన కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి నిర్వహించారు. ఈ సమావేశంలో దేవస్థానంలో జరిగే వార్షిక ఉత్సవాల ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. ఈ నెల 27వ తేదీన జరగనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణమహోత్సవాన్ని అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పక్కాగా చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆలయ పరిసరాల శుభ్రత, విద్యుత్ దీపాలంకరణ, తాగునీరు, భక్తులకు సౌకర్యవంతమైన క్యూలైన్ వ్యవస్థ, పార్కింగ్ సదుపాయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వైద్య శిబిరాలు, అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కూడా పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2026 సంవత్సరానికి సంబంధించిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి బ్రహ్మోత్సవాల పోస్టర్ను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాలను సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, దేవస్థాన కమిటీ సభ్యులు సమన్వయంతో పని చేస్తేనే భక్తులకు మెరుగైన సేవలు అందించగలమని ఆమె అభిప్రాయపడ్డారు. భక్తులందరూ సౌకర్యవంతంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో స్వామివారి దర్శనం చేసుకునేలా అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలని ఆమె ఆకాంక్షించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ మంజుల, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గిరగాని కుమార్ స్వామి గౌడ్, ఎర్రబెల్లి రాఘవరావు, నీరటి చంద్రయ్య, దేవస్థానం ఈవో మోహన్ బాబు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు



## శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు..!

- బాలాజీ నగర్ లో పందిరి గుంజ ప్రతిష్ట కార్యక్రమం.



ఉదయం, జనగామ ప్రతినిధి : (కమ్మగాని రమేష్ గౌడ్, సీనియర్ జర్నలిస్టు ):
శ్రీరామనవమి పురస్కరించుకొని జనగామలో మూడో వార్డులోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం ప్రాంగణంలో సీతారాముల కళ్యాణ వేడుకలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రేణుక ఎల్లమ్మ దేవాలయ ముందు పందిరి గుంజా నాటే కార్యక్రమం శాస్త్రోక్తంగా పూజ నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాలనీవాసులు దేవాలయ కమిటీ బాధ్యులు సభ్యులు మహిళలు యువకులు హాజరయ్యారు. భక్తులు 27న కళ్యాణ మహోత్సవానికి అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సీతారాముల కళ్యాణానికి ఆర్థిక హార్దిక సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి గా మూడవ వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి గోపి,ఆలయ పూజారి మారుపాక శ్యాంప్రసాద్, నిర్వాహకులు, భక్తులు దూడల రమేష్, బెలిదె శ్రీధర్, లగిశెట్టి కృష్ణమూర్తి, మోటె శ్రీనివాస్, పెండ్లి సత్తిరెడ్డి, టీవీ యాన్ రెడ్డి, దోసపాటి శ్రీనివాస్, గొట్టం శ్రీధర్ రెడ్డి, కెమిడీ రాజశేఖర్, గూడెల్లి రాజు, బైరు నాగరాజు,సివిఎల్ యన్ రెడ్డి, ఐత జయరాములు,సత్యనారాయణ, మంగ శివశంకర్,జోగు కొండయ్య, మచ్చ ప్రవీణ్ గౌడ్. దూడల శోభా రాణి, పద్మావతి, మంజుల, రేణుక, అనిత, కళావతి, దీప తదితరులు పాల్గొన్నారు.



# "కఠిన శిక్షణ – క్రమశిక్షణే..!

- ఆయుధం... వేలాది.
- విద్యార్థుల భవిష్యత్తును తిరోగమన దిశలో తీర్చిదిద్దిన గురువు ఇకలేరు"
- కొడకండ్ల విద్యార్థి లోకం శోకసంద్రం.
- కాసం సత్తయ్య సార్‌కు పూర్వ విద్యార్థుల కన్నీటి నివాళి.

ఉదయం, జనగామ ప్రతినిధి:
జనగాం జిల్లా కొడకండ్ల మండల కేంద్రం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాధానోపాద్యాయుడుగ పనిచేసి పదవీ విరమణ పొందిన కాసం సత్తయ్య మరణించారనే వార్తతో కొడకండ్ల గ్రామం మొత్తం శోకసంద్రంగా మారింది. కఠినమైన విద్య, క్రమశిక్షణ, నిస్వార్థ సేవతో విద్యార్థుల జీవితాలను మార్చిన మహానుభావుడిగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఆ రోజుల్లో ఒకే పాఠశాలలో 18 మంది ఉపాధ్యాయులు సంవత్సరాల పాటు కలిసి పనిచేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేశారు. పాఠశాలలో గదులు లేకపోవడంతో ప్రజాప్రతినిధుల సహకారంతో బెంగళూరు పెంకతో నాలుగు గదులు నిర్మించడం, బాలికలకు మూత్రశాలలు ఏర్పాటు చేయడం, 9– 10 తరగతి విద్యార్థులకు బెంచీలు, ఫ్యాన్లు పాఠశాల చుట్టూ ప్రహరీ ప్రహరీ లోపల బోరింగు పూర్వ విద్యార్థుల తో నీళ్ల ట్యాంక్ సమకూర్చడం వంటి పాఠశాల అభివృద్ధి పనుల్లో సత్తయ్య కీలక పాత్ర పోషించారు.
ఒక తరగతి గదిలో 80 నుంచి 100 మంది విద్యార్థులు ఉన్నా, ప్రతి విద్యార్థికి అర్థమయ్యే విధంగా ఎ,బి,సి,డి గ్రూపులుగా విభజించి బోధించేవారు. క్రమశిక్షణ విషయంలో ఎంత పెద్ద నాయకుల పిల్లలు ఉన్నప్పటికీ ఎలాంటి ఉపేక్ష లేకుండా నియమాలు అమలు చేసేవారు.



డ్రెస్ కోడ్ విషయంలో కఠినంగా వ్యవహరించేవారు.
ప్రతి రోజు ప్రార్థన కార్యక్రమాన్ని విద్యార్థులతోనే బ్యాండ్ మేళాలు వాయింపజేసి నిర్వహించేవారు. గ్రామాల్లో టీవీలు లేని రోజుల్లో పాఠశాలలో టీవీ ఏర్పాటు చేసి ప్రతి శనివారం, ఆదివారం రాత్రి 7 నుంచి 10 గంటల వరకు విద్యార్థులు, గ్రామ ప్రజలు వార్తలు చూసేలా ఏర్పాట్లు చేశారు. ప్రార్థన సమయంలో రాష్ట్రం, దేశంలో జరిగిన ముఖ్య వార్తలను వినిపించి విద్యార్థులకు సామాజిక, రాజకీయ అవగాహన కల్పించేవారు. హాస్టల్ విద్యార్థుల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టేవారు విద్యార్థుల్లో నిజాయితీ ని పెంచేందుకు హానెస్ట్ షాప్ (పెన్నులు కాపీలు ములుకులు )ఎవరికీ వారే గల్ల పెట్టేలో డబ్బులు వేసి కావలిసి న వస్తువు ను తీసుకోవాలి అలాంటి షాపును ఏర్పాటు చేసి నాటి విద్యర్థులలో నిజాయితీ పెంచేవారు విద్యార్థులలో సృజనాత్మకంగా పెంచేందుకు ఎగ్జిబిషన్లకు తీసుకు వెళ్లేవారు. ప్రతి సంవత్సరం ఒక బ్యాచ్ ని ఎక్స్ కర్షన్ కు తీసుకు వెళ్లేవారు పాఠశాల నుండి సైన్స్ ఫెయిర్ కీ తీసుకెళ్ళేవారు. విద్యార్థులకు ఉపన్యాస పోటీలు వకృత్వం పోటీలు ప్రతి ఏడాది మాక్ అసంబ్లీ నిర్వహించి, రాష్ట్ర అసంబ్లీ ఎలా ఉంటుందో విద్యార్థులకు తెలియజేశారు.
సత్తయ్య మరణ వార్తతో 1993--94 పదవ తరగతి పూర్వ విద్యార్థులు, గ్రామ ప్రజలు, ఆనాటి ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు ఆయన సేవలను జ్ఞాపకం చేసుకుంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ 1993--94 10వ తరగతి బ్యాచ్ వినమ్రంగా నివాళులు అర్పించింది.
సత్తయ్య గారు "గురువు కాదు -- ఒక వ్యవస్థ...!
సత్తయ్య మృతి కొడకండ్ల విద్యార్థి లోకానికే కాదు తల్లితండ్రిలకు తీరని లోటు"
"క్రమశిక్షణకు కఠిన రూపం... ప్రేమకు మృదువైన హృదయం – సత్తయ్య సార్‌కు కన్నీటి వీడ్కోలు"
"ఒక గురువు వెళ్లిపోయారు... వేలాది విద్యార్థుల జ్ఞాపకాలలో శాశ్వతంగా నిలిచిపోయారు"
"పాఠశాలను తీర్చిదిద్దిన గురువు... విద్యార్థుల భవిష్యత్తును నిర్మించిన మహానుభావుడు ఇకలేరు" అని 1993–94 పదవతరగతి బ్యాచ్ అధ్యక్షులు పసునూరి మధుసూదన్ తెలిపారు.

## నాగులవంచ రైతు వేదికలో రైతు భరోసా సంబరాలు..




చింతకాని, మార్చి 22 మెట్రో ఉదయం
చింతకాని మండల పరిధిలో నాగులవంచ రైతువేదికలో వ్యవసాయ శాఖ అధ్వర్యంలో ఏర్పటు చేసిన తెలంగాణ రైతు బరోసా నిధుల విడుదల టెలి కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గున్న మత్కేపల్లి వ్యవసాయ మర్కెట్ కమిటి చైర్మన్ ఉచింతకాని మండల కాంగ్రెస్ పార్టి అద్యక్షులు అంబటి వెంకటేశ్వరరావు మరియు వ్యవసాయ అధికారులు, డీఈవోడి. పుల్లయ్య, ఏడిఏఎస్. విజయ్ చంద్ర, ఎంఏడి.ఎస్. మనసా, ఏఈఓస్: డి. కళ్యాణి, బి.కార్తిక్, ఈ సందర్భంగా అంబటి మాట్లడుతూ రాష్ట్రం పెద్ద మొత్తంలో ఆర్థిక లోటు ఉన్నపటికీ రైతున్నకు ఆర్థిక బరోసా కోసం ప్రబుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేసింది అని .రైతు భరోసా నిధులు రైతులకు ఆర్థికంగా ఎంతో ఉపయోగపడతాయని,రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని తెలిపారు వ్యవసాయ అధికారులు మాట్లాడతూ రైతులు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని, వ్యవసాయ అధికారులు రైతులకు ఎల్లప్పుడూ సహకారం ఉంటుందని తెలిపారు . ఈ సందర్భంగా రైతులు బాణసంచా కాల్చి రైతు భరోసా సంబరాలు నిర్వహించరు ఈ కార్యక్రమంలో జిల్ల అత్మ కమిటి మెంబర్ కొప్పుల గొవిందరావు , మండలంలో వివిద గ్రామల నాయకులు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గున్నరు



# దళిత ఎమ్మెల్యే ఇంటిపై దాడికి ఎంపీ ఈటెల రాజేందర్ స్పందించాలి

- బోడుప్పల్లో 370వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు జ్ఞానమాల
- మందుల సామెల్ ఇంటిపై దాడిని తీవ్రంగా ఖండించిన నత్తి మైసయ్య
- నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన అంబేద్కర్ ఆశయ సాధన సభ్యులు
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులపై గరికపాటి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి
- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య

మేడిపల్లి మార్చ్ 21(మెట్రో ఉదయం)
మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 370వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది.తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ ఇంటిపై బిజెపి నాయకులు దాడి చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ ఆ దాడికి నిరసనగా అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ



ఎవరి మనోభావాలు అయినా దెబ్బతింటే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి,నిరసన కార్యక్రమాలు నిర్వహించాలి, అంతే కానీ ఇంటిపై టమోటాలు,కోడిగుడ్లతో దాడి చేయడం మహిళలను భయభ్రాంతులకు గురి చేయడం బిజెపి నేతల పనికిమాలిన చర్య అని నత్తి మైసయ్య మండిపడ్డారు.ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడంలో పోలీసు యంత్రాంగం విఫలమైందని,తక్షణమే దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎంపీ ఈటల రాజేందర్ ఈ ఘటనపై తక్షణమే స్పందించాలని,బిజెపి నాయకులపై పార్టీ పరంగా చర్యలు తీసుకొని తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని నత్తి మైసయ్య అన్నారు. అదేవిధంగా గరికపాటి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన మాటలు తీవ్ర అభ్యంతరకరమని తక్షణమే ఆయన తన మాటలు వెనక్కి తీసుకోవాలని నత్తి మైసయ్య గరికపాటిని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య, ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇటికాల రవీందర్, రాపోలు శ్రీరాములు, బోడుప్పల్ అరుంధతి మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గురుకుల యాకయ్య, పీఎం దాసు, యేసు రాజు, సాయి బండారి, ఏ రాజేష్, జై భీమ్ అజయ్,గరుగుల స్వర్ణరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతోనే ప్రశాంత జీవనం


- మల్కాజ్గిరి ఎంపీ.ఈటల రాజేందర్..




కుత్బుల్లాపూర్ మార్చి 22 (ఉదయం ప్రతినిధి):
యాంత్రిక జీవనానికి అలవాటైన ప్రజలు ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంత జీవనం పొందుతారని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు.కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధి,చింతల్ డివిజన్ హెచ్ఎంటి కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి మందిరం పరిధిలో సామ్రాట్ అశోక్ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుత మార్గంలోనే ప్రతి ఒక్కరు నడవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బిజెపి తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీనర్ రావుల శేషగిరి,మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి,కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జెకె.శేఖర్ యాదవ్,సీనియర్ నాయకులు భరత్ సింహారెడ్డి,సదానంద్,శ్రీనివాస్ రెడ్డి,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# రామాలయం విగ్రహ ప్రతిష్ఠకు సిద్ధం

- మూడు రోజుల మహోత్సవం ఘనంగా నిర్వహణ
- పూజలు, హోమాలతో ఆధ్యాత్మిక వాతావరణం
- మూడవ రోజు ప్రధాన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం
- భక్తులకు అన్నదాన కార్యక్రమం
- ఆలయం వద్ద విస్తృత ఏర్పాట్లు
- గ్రామస్తుల సమిష్టి కృషితో మహోత్సవం
- భారీగా తరలివస్తున్న భక్తులు...



కరకగూడెం, మార్చి 22 (ఉదయం)..
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కరకగూడెం మండలంలోని అనంతారం గ్రామంలో నిర్మాణం పూర్తిచేసుకున్న నూతన రామాలయం గుడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి సిద్ధమైంది. ఈ మహోత్సవం సోమవారం నుండి బుధవారం వరకు మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడనుంది. ఆలయ ప్రాంగణం ఇప్పటికే రంగురంగుల తోరణాలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించబడుతూ పండుగ వాతావరణాన్ని సృష్టిస్తోంది. గ్రామస్తులు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. మహోత్సవం మొదటి రోజు గణపతి పూజ, పుణ్యాహవాచనం, యాగశాల ఏర్పాటు వంటి కార్యక్రమాలతో ప్రారంభమవుతుంది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య హోమాలు నిర్వహించి దేవతలను ఆహ్వానిస్తారు. రెండవ రోజు వివిధ



హోమాలు, ప్రత్యేక అర్చనలు, భజనలు, హరినామ సంకీర్తనలు నిర్వహించి భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతారు. మూడవ రోజు ప్రధాన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత వైభవంగా జరుగుతుంది. వేదమంత్రాల మధ్య శ్రీ సీతా రామ లక్ష్మణ సమేత విగ్రహాలను ప్రతిష్ఠించి కుంభాభిషేకం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తారు. మహోత్సవం విజయవంతం కావడానికి గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత వంటి అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఈ మహోత్సవం గ్రామంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించనుంది తెలిపారు....

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన పత్రికా విలేకరులు



సంస్థాన్ నారాయణపురం, మార్చి 22, (మెట్రో ఉదయం ప్రతినిధి):–
యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని ముస్లిం సోదరులను శనివారం రోజున కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలియ జేశారు మండల విలేకరులు. ఈ పర్వదిన సందర్భంగా ముస్లిం సోదరులు పవిత్రంగా నెలరోజులపాటు ఉపవాస దీక్షలు చేపట్టి అల్లాకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ముస్లిం సోదరులందరికీ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రహీం షరీఫ్, నహీం షరీఫ్, అడ్డు బాయ్, యూసఫ్ ఖాన్, నిజం చెబుతా విలేకరు సింగం కృష్ణ, భద్రాద్రి న్యూస్ విలేకరి బోయ అనిల్ కుమార్, మెట్రో ఉదయం విలేకరి అందోజు వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ ఆహారం, కాలుష్యంతో అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి: మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసాని



సికింద్రాబాద్, మార్చి 22 (మెట్రోఉదయం)
కల్తీ ఆహార పదార్థాలు, కాలుష్యపూరిత వాతావరణం కారణంగా ప్రజల్లో అనేక అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో సనత్‌నగర్ నియోజకవర్గానికి చెందిన 47 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.20,01,500 విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో వైద్య ఖర్చులు భారీగా పెరిగిపోయాయని, దీనివల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలు చికిత్స పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సమయానికి చికిత్స తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లభించే ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొని మెరుగైన వైద్యం పొందాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు నామన శేషుకుమారి, టి. మహేశ్వరి, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, శ్రీనివాస్ గౌడ్, ఎల్. వెంకటేషన్ (రాజు),నాయకులు లలిత, గందే నాగులు, శ్రీహరి, అశోక్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, ఖలీల్, శేఖర్, ఆరీఫ్, కూతురు నర్సింహ, నామాల ప్రేమ్ కుమార్, గోపిలాల్ చౌహన్, కట్టా బలరాం, కొత్తూరు వెంకట్, హరిసింగ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసి నేత లోకిని రాజుకు స్వర్ణ నంది ఉగాది పురస్కారం




హనుమకొండ, మార్చి 22 ( మెట్రో ఉదయం):
మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్. అంబేద్కర్ ఆలోచన విధానాన్ని పునికి పుచ్చుకొని ఆదివాసీల హక్కుల కోసం పోరాడుతున్న ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజుకు స్వర్ణ నంది ఉగాది పురస్కారం లభించింది. ఖమ్మం జిల్లా కేంద్రంలోని రామాలయం బైపాస్ రోడ్డులోని ఎస్ఎస్పీ రామగిరి ఫంక్షన్ హాల్లో ఆదివారం స్వర్ణనంది ఉగాది పురస్కారాల ప్రదానోత్సవాల కార్యక్రమాన్ని మొగిలి ఎస్ఎస్ ఎంటర్టైన్మెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొగిలి ఎస్ఎస్ ఎంటర్టైన్మెంట్స్ కన్వీనర్, ప్రముఖ కమేడియన్ . యాంకర్ మొగిలి గుణాకర్ , కో –కన్వీనర్ సినీ నటుడు, ప్రముఖ భక్తిగీతాల గాయకుడు నాగసాయి. తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పాలకుర్తి కృష్ణ చేతుల మీదుగా లోకిని రాజుకు స్వర్ణ నంది ఉగాది పురస్కారంతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేసి శాలువాతో సత్కరించి అభినందించారు.

## వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- వడ్డెర సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంత మురళి



హనుమకొండ, మార్చి 22 ( మెట్రో ఉదయం):
వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్ను వెంటనే నియమించాలని వడ్డెర సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, వరంగల్ జిల్లా ఓబీసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ బొంత మురళి టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను కోరారు. శ హైదరాబాద్ లో మహేష్ కుమార్ గౌడ్ ను ఆయన నివాసంలో వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బొంత మురళి మాట్లాడుతూ వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. వెయి కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న క్వారీలపై వడ్డెరలకే హక్కు కల్పించే విధంగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన వారిలో వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు బత్తుల వెంకటేష్, మల్లికార్జున్, వెంకన్న, ఐలయ్య, రాజు, ప్రదీప్, రాము, గణేష్, కృష్ణ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పాలనలో నెరవేరిన సొంతింటి కళ..

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు ధన్యవాదములు తెలిపిన లబ్ధిదారులు



కొడిమ్యాల, మార్చి 22 (మెట్రో ఉదయం): రిపోర్టర్ కొండూరి సురేష్
నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇళ్ళు అనేది ఒక్క కళ,ఆ కళ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారం తో నెరవేర్చుకున్నామని కొడిమ్యాల ఇందిరమ్మ ఇళ్ళు లబ్ధిదారులు మొగిలి చైతన్య –నాగరాజు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ళు నిర్మాణం పూర్తి కాగా ఆదివారం గృహప్రవేశం చేశారు. అట్టి కార్యక్రమంలో కొడిమ్యాల గ్రామ సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో కొడిమ్యాలలో 70 ఇండ్లు మంజూరు చేసుకొన్నామని, రాబోవు రోజుల్లో మరిన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో వెన్నంటి నిలుస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు కృతజ్ఞతలు తెలిపారు.

## రైతు అభ్యున్నతి కాంగ్రెస్ లక్ష్యం...



కొడిమ్యాల, మార్చి 22 (మెట్రో ఉదయం): రిపోర్టర్ కొండూరి సురేష్
రైతు భరోసా నిధులు మొదటి విడతలో భాగంగా 70 లక్షల మంది రైతులకు ఎకరాకు 6000 చొప్పున 3590 కోట్ల రూపాయలు సిద్ధిపేట జిల్లాలో నార్మట్ట సభలో విడుదల చేసి రైతుల ఖాతాలో జమ చేసినందుకు మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిలువేరి నారాయణ గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ప్రజపాలన లో భాగంగా రైతు భరోసా నిధులు విడుదల చేసినందుకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరమ్ జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం జీవన్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండూరి రాజేష్, మండల సర్పంచ్లు నేరెళ్ల మహేష్, బొడ్డేలి భరత్, మాజీ సర్పంచ్లు మ్యాకల మల్లేశం, పర్లపల్లి ప్రసాద్, నాయకులు కిసాన్ సెల్ అధ్యక్షులు రాఘవ రెడ్డి,మైనార్టీ నాయకులు హుసేన్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గాజుల అజయ్, వెంకీ సోమ, జలంధర్, జామల్పురి నిఖిల్, రంజిత్, ముమ్మాడి స్వామీ, పిడుగు లక్ష్మారెడ్డి, లచ్చయ్య, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జీవన నైపుణ్యాలు విజయానికి సోపానాలు...

- మూడవ రోజు శ్రమదాన కార్యక్రమం




కొడిమ్యాల, మార్చి 22 (మెట్రో ఉదయం): రిపోర్టర్ కొండూరి సురేష్
కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూరు గ్రామంలో నిర్వహిస్తున్న ఏడు రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా ఆదివారం మూడవ రోజు ఉదయం శ్రమదాన కార్యక్రమంలో గ్రామంలోని పలు వీధులను,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ, క్రీడా మైదానం లో గల పిచ్చి మొక్కలను చెత్తా చెదారాన్ని ఎన్ఎస్–ఎస్ వాలంటీర్లు తొలగించి శుభ్రపరిచారు. అనంతరం మధ్యాహ్న కార్యక్రమంలో శాతవాహన విశ్వ విద్యాలయం తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా విచ్చేసి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ... జీవితంలో ఎదురయ్యే సవాళ్లను రోజువారి సమస్యలను ఎదుర్కోవడానికి అవసరమైన సామాజిక మానసిక నైపుణ్యాలనే జీవన నైపుణ్యాలని తెలియజేశారు. స్వీయ అవగాహన, సృజనాత్మక ఆలోచన, నిర్ణయాలు తీసుకోవడం, ఒత్తిడిని ఎదుర్కోవడం, సమస్య పరిష్కారం వంటి నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా విజయం సాధించవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల మాజీ ఎన్ఎస్–ఎస్ ప్రోగ్రాం అధికారి, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ రాపోలు గోపి కృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డి.సాగర్, బైరం మహేష్, ఎన్.శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## కోదాడ పెద్ద మసీదులో భక్తిశ్రద్ధలతో ఈద్ నమాజ్.....



కోదాడ మార్చి 22 మెట్రో ఉదయం..........
రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కోదాడ పట్టణంలోని పెద్ద మసీదులో ముస్లిం సోదరులు ఈద్ నమాజ్‌ను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మసీదులో జరిగిన సామూహిక ప్రార్థనలను ముఫ్తీ అతహర్ సాబ్ చదివించారు. రంజాన్ మాసం పొడవునా ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులకు మసీదు కమిటీ అధ్యక్షులు షేక్ మొహమ్మద్ ఆధ్వర్యంలో అన్ని రకాల వసతులు కల్పించారు. నమాజ్ అనంతరం ముఫ్తీ అతహర్ సాబ్ ప్రత్యేక దువా నిర్వహించి, ప్రపంచ శాంతి కోసం ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మసీద్ ఏ మొహదీన్ అలీ మజీద్ ముతవలి,ఎం.డి. మజహర్, ఎం.డి. మహమూద్ షరీఫ్, పెద్ద మసీదు కమిటీ మాజీ సభ్యులు సయ్యద్ ముస్తఫా, అడ్వకేట్ ఎస్.కె. కరీముల్లా హఫీజ్ తదితరులు పాల్గొన్నారు....

## కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మాజీ ఎంపీపీ గుత్తా ఉమా ప్రేమ్ చందర్ రెడ్డి



సంస్థాన్ నారాయణపురం, మార్చి22, (మెట్రో ఉదయం ప్రతినిధి):–
యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకం అయ్యారు సంస్థాన్ నారాయణపురం మండలం మాజీ ఎంపీపీ గుత్తా ఉమా ప్రేమ్ చందర్ రెడ్డి. ఈ నియామక పత్రాన్ని టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ జిల్లా అధ్యక్షులు బీర్ల ఐలయ్య అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెండవసారి నియామకం చేసినందుకుగాను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి, అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## తేనేటి విందులో పాల్గొన్న ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి.....



ఉదయం, పాలకుర్తి ప్రతినిధి : (కమ్మ గాని రమేష్ గౌడ్, సీనియర్ జర్నలిస్టు ):
రమజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని పాలకుర్తి పట్టణ మైనారిటీ నాయకులు ఎండి యాకూబ్ ఆహ్వానాన్ని మన్నించి పాలకుర్తి శాసనసభ్యులు మామిడాల యశస్విని రెడ్డి, ఎండి యాకూబ్ , వారి కుటుంబ సభ్యులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమార్ స్వామి గౌడ్, చెన్నూర్ సర్పంచ్ కారు పోతుల శ్రీనివాస్ గౌడ్, వర్రె వెంకన్న, పులి గణేష్ గౌడ్, కమ్మగాని నాగన్న గౌడ్, చిలివేరి కృష్ణమూర్తి,కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## రంజాన్ పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే తలసాని ముస్లిం మైనార్టీల శుభాకాంక్షలు



సికింద్రాబాద్, మార్చి 22 (మెట్రోఉదయం)
రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం వెస్ట్ మారేడ్‌పల్లి లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో పలువురు ముస్లిం నాయకులు, ప్రజలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు పుష్పగుచ్చాలు, స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ... రంజాన్ పర్వదినం శాంతి, సహనం, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. సమాజంలో ఐక్యతను పెంపొందించేందుకు ఈ పండుగలు దోహదపడతాయని అన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బేగంపేటకు చెందిన సీనియర్ నాయకులు అక్బర్, ఆరీఫ్, నసీమా, బన్సీలాల్‌పేట్‌కు చెందిన అబ్బాస్, రజాక్, ఫహీం, జహంగీర్ తదితరులు ఉన్నారు.



## యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి.....

- కౌన్సిలర్ షాబుద్దీన్.....
- నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీమ్....



కోదాడ మార్చి 22 మెట్రో ఉదయం..........

యువజన కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీమ్ అన్నారు. ఆదివారం మాతా నగర్ 27వ వార్డు యూత్ ప్రెసిడెంట్‌గా షేక్ సైదాను నియమించారు. కౌన్సిలర్ షాబుద్దీన్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో అజీమ్ మాట్లాడుతూ యువత రాజకీయాల్లో చురుగ్గా పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వార్డు స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి, కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను గడప,గడపకు తీసుకు వెళ్లేందుకు యూత్ కాంగ్రెస్ నాయకులు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. కొత్తగా ఎన్నికైన సైదాకు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమాల్, హరిఫ్, కాశీం, మున్నా, బాబ్బు, రహీం, సాయి, శ్రీను, జలాల్, ఉమార్, హనీఫ్,ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.......

## శ్రీ సీతారాముల కళ్యాణ పత్రిక పంపిణీ ప్రారంభం...



సికింద్రాబాద్, మార్చ్ 22 (మెట్రోఉదయం)

నామాల గుండులోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 27వ తేదీన జరగనున్న శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు శిల్పాచారి కళ్యాణ పత్రిక ముద్రణకు దాతగా ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా కళ్యాణ పత్రికను శిల్పాచారి చేతుల మీదుగా ఆలయ చైర్మన్ రాము, ధర్మకర్త మున్నూరు చందు, ఆర్ ప్రతాప్ కుమార్, శ్యామల రమణి, సాయికుమార్ అర్చకుల ఆధ్వర్యంలో దేవాలయంలో భక్తుల ఆహ్వానానికి వారికి అందించే పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శిల్పాచారి సేవలను అభినందిస్తూ, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళ్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## ఎన్నికల హామీ నెరవేర్చిన సర్పంచ్...

- ఆడబిడ్డ జననానికి 'మహాలక్ష్మి కానుక'గా నగదు అందజేత



చౌటుప్పల్, మార్చి 22 (మెట్రో ఉదయం)

చౌటుప్పల్ మండల పరిధిలోని తుప్రాన్‌పేట గ్రామ సర్పంచ్ బక్కతట్ల రాధిక--శ్రీశైలం యాదవ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చారు. గ్రామపంచాయతీ మేనిఫెస్టోలో పేద, మధ్యతరగతి కుటుంబాల్లో జన్మించే ఆడబిడ్డలకు 'మహాలక్ష్మి కానుక' అందజేస్తానని ప్రకటించి తాజాగా ఆ మాట నిలబెట్టుకున్నారు. గ్రామానికి చెందిన వర్కారి మౌనిక--బాలకృష్ణ దంపతులకు ఇటీవల ఆడబిడ్డ జన్మించిన విషయం తెలుసుకున్న సర్పంచ్, ఆదివారం వారి ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఇచ్చిన హామీ ప్రకారం ఆ చిన్నారికి 'మహాలక్ష్మి కానుక'గా రూ.10,116 నగదు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచ్ ముద్దం రమేష్ యాదవ్, వార్డు సభ్యులు బొజ్జ స్వామి, బక్కతట్ల శ్రీకాంత్ యాదవ్, మంటిపల్లి మల్లయ్య యాదవ్, వర్కారి బాలకృష్ణ, పోచమోని అండాలు, గంధం భాగ్యమ్మ అశోక్, భారాస గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి చంచల భరత్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు బక్కతట్ల యాదగిరి యాదవ్, వర్కారి రాము, వంటల ప్రవీణ్, చిలుకల మల్లేష్, గుండెమోని నాగరాజు యాదవ్, పోచమోని పవన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్



కంటోన్మెంట్, మార్చి 22 (మెట్రోఉదయం)

మోండా డివిజన్ రెజిమెంటల్ బజార్ లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయకులు బద్రీనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉండే ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని, కార్పోరేట్ హాస్పిటల్స్ కు వెళ్లి వైద్యం చేయించుకోలేని వారికి ఇలాంటి శిబిరాలు ఉపయోగ పడతాయని, ప్రభుత్వ హాస్పిటల్స్ లో మెరుగైన వైద్యం అందిస్తుందని అన్నారు. ఇలాంటి శిబిరాల్లో ఉచిత పరీక్షలతో పాటు మందులు ఉచితంగా అందిస్తున్నారని, పేద ప్రజలు వీటిని ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌరీ శంకర్, నందికంటి రవి బాబూరావు ముదిరాజ్ పాల్గొన్నారు.

# మంత్రి అడ్లూరి చొరవతో ఇందిరమ్మ కాలనీకి 'విద్యుత్' వెలుగులు

- ఒకే రోజులో స్తంభాల ఏర్పాటు, బల్బుల బిగింపు
- ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు



వెల్గటూర్ మార్చి 22(మెట్రో ఉదయం )

వెల్గటూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మితమవుతున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల విద్యుత్ కష్టాలకు తెరపడింది. కాలనీ వాసుల ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవ చూపడంతో, అధికారులు యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పనులను పూర్తి చేశారు. మంత్రి ఆదేశాలతో రంగంలోకి దిగిన విద్యుత్ శాఖ అధికారులు, ఒకే రోజులో కాలనీకి అవసరమైన విద్యుత్ స్తంభాలను(5) ఏర్పాటు చేసి, లైన్లను లాగి విద్యుత్ బల్బులను కూడా అమర్చారు. ఈ పనులను ఉపసర్పంచ్ గండ్ర ప్రతాప్ రావు కొబ్బరికాయ కొట్టి అధికారికంగా ప్రారంభించారు. ఒకే రోజులో అంధకారం తొలగి, కాలనీ వీధులు వెలుగులతో నిండటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.సమస్యను తక్షణమే పరిష్కరించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు మరియు పనులను పర్యవేక్షించిన ఉపసర్పంచ్ ప్రతాప్ రావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మెరుగు మురళీ గౌడ్, వార్డ్ సభ్యులు గుండాటి సందీప్ రెడ్డి, నక్క సురేష్, బీసీ సెల్ అధ్యక్షుడు బందెల ఉదయ్ గౌడ్,యూత్ కాంగ్రెస్ సెక్రెటరీ గండ్ర శ్రీకాంత్ రావు,పెద్దూరి భరత్ కుమార్, వెలగందుల సంతోష్, కొండ లక్ష్మీనారాయణ, పందిరి వెంకటేష్, మెరుగు ప్రవీణ్, గుమ్ముల తిరుమలేశ్, మహాలక్ష్మి కన్స్ట్రక్షన్ (సన )సూపర్వైజర్ పరంకుశం సాయి, రంగు మహేశ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



# రాహదారి ఇటు..అటు బోర్డు



- ఇవేం సూచికలు అంటున్న వాహనదారులు.........

రాయికల్ మార్చి 22 (మెట్రో ఉదయం):

రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలోని శివాజీ విగ్రహం నుంచి రాయికల్ రోడ్డు లోని దాదాపు రెండు పర్లాంగుల దూరంలో ఉన్న ఎడమ మరియు కుడి వైపు ఉన్నటువంటి రహదారి సూచిక బోర్డులు రోడ్డు పక్కనే ఉన్న ముళ్ళ పొదల్లోకి వంగి ఉండడం వల్ల వాహనదారులకు అర్థం కావడం లేదు రహదారి ఇటువైపు ఉంది బోర్డు అటువైపు ఉంది కావున సంబంధిత అధికారులు వెంటనే చొరవ తీసుకొని సూచిక బోర్డులను సరిచేయాలని వాహనదారులు కోరుతున్నారు



# తాటి రామచంద్రం జ్ఞాపకార్థం చలివేంద్రం ప్రారంభం

- బస్టాండ్ ఆవరణలో ప్రజలకు చల్లని నీరు - మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్

చౌటుప్పల్,మార్చి 22 (మెట్రో ఉదయం)

చౌటుప్పల్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో స్వర్గీయ తాటి రామచంద్రం జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. రాజీవ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, తాటి రామచంద్రం సేవా సమితి నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ చేతుల మీదగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కీర్తిశేషులు తాటి రామచంద్రం కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఆయన స్మారకార్థంగా సేవా సమితి చైర్మన్ తాటి వెంకటేశం ప్రతీ సంవత్సరం వేసవికాలంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల దాహాన్ని తీర్చడం అభినందనీయమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక






వినయ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, కౌన్సిలర్లు పిల్లలమర్రి మధుసూదన్, పాక చిరంజీవి, మత్స్యకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పాశం సంజయ్ బాబు, శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అధ్యక్షుడు బొబ్బిళ్ళ మురళి, సేవా సమితి చైర్మన్ తాటి వెంకటేశం, ప్రధాన కార్యదర్శి చెరుకు లింగస్వామి, కాంగ్రెస్ నాయకులు గోశిక రవి, గుర్రం వెంకటేశం, గోశిక ప్రభాకర్, బొబ్బిళ్ళ రాజేందర్, రఫీ, బొంగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్యస్నేహానికి బలమైన బంధం... నాగరాజు కుటుంబానికి లక్ష సాయం

చౌటుప్పల్, మార్చి 22 (మెట్రో ఉదయం)

అనారోగ్యంతో మృతిచెందిన ఐతరాజు నాగరాజు కుటుంబానికి ఆయన బాల్యమిత్రులు ఆదర్శంగా నిలిచారు. కష్టసమయంలో స్నేహబంధాన్ని చాటుతూ 1998-99 విద్యా సంవత్సరానికి చెందిన 10వ తరగతి స్నేహితులు కలిసి రూ.1 లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. హనుమాన్ నగర్‌లోని నాగరాజు నివాసంలో స్నేహితులు కుటుంబ సభ్యులను పరామర్శించి నగదు సహాయం అందించారు. నాగరాజు ఆకస్మిక మరణంతో కుటుంబం తీవ్ర విషాదంలో ఉన్న వేళ, తమ బాల్య స్నేహాన్ని గుర్తుచేసుకుంటూ ముందుకు వచ్చి ఈ సహాయం అందించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ, "ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు... మా స్నేహానికి, బాధ్యతకు ప్రతీక. ఇలాంటి కష్టసమయంలో మనం ఒకటిగా నిలబడటం మన కర్తవ్యంగా భావించాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హరికృష్ణ, కృష్ణ, చిక్క శ్రీనివాస్, బాలకృష్ణ, సతీష్, వెంకటేష్, అశ్విన్, నాగార్జున్, సామి, రాజచంద్ర, ఆలమ్ తదితరులు పాల్గొన్నారు.



## "ఇంటి పన్ను పేరుతో ప్రజలపై భారమా..? ప్రభుత్వం సమాధానం చెప్పాలి: జర్నలిస్ట్ సత్యం గౌడ్"



హైదరాబాద్, మార్చి 22 (మెట్రోఉదయం):
ఇంటి పన్ను వ్యవస్థపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని ప్రస్తావిస్తూ భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యం గౌడ్ ప్రభుత్వం పై ఘాటు విమర్శలు చేశారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "ఇంటి పన్ను విషయంలో ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోంది" అని ఆరోపించారు. ప్రభుత్వం అందించే సేవలన్నింటికీ ప్రజలు ఇప్పటికే బిల్లులు చెల్లిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. "నీరు ఇస్తే నీటి బిల్లు, కరెంట్ ఇస్తే కరెంట్ బిల్లు, చెత్త సేకరణకు కూడా చార్జీలు వసూలు చేస్తున్నారు. అయితే మన ఇంటికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఏం చేస్తుంది? ప్రతి సంవత్సరం ఇంటి పన్ను ఎందుకు కట్టాలి?" అని ప్రశ్నించారు. భూమి కొనుగోలు సమయంలో రిజిస్ట్రేషన్ ఫీజులు, ఇల్లు నిర్మాణానికి అనుమతుల కోసం భారీ మొత్తాలు చెల్లిస్తున్నామని, అంతేకాకుండా అదనపు అంతస్తులు నిర్మించాలంటే మరింత ఖర్చు చేస్తున్నామని సత్యం గౌడ్ వివరించారు. అయినప్పటికీ ప్రతి ఏడాది ఇంటి పన్ను వసూలు చేయడం అన్యాయమని ఆయన అభిప్రాయపడ్డారు. "ఇది ప్రజాస్వామ్యమా లేక రాచరికమా? ప్రజలు తమ హక్కుల కోసం ప్రశ్నించాల్సిన సమయం వచ్చింది" అని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం తక్షణమే ఈ అంశాన్ని పునఃసమీక్షించి ఇంటి పన్నును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలందరూ ఈ విషయంపై ఆలోచించి, తమ హక్కుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని సత్యం గౌడ్ కోరారు.

## ముంజకాయులు వేసవి కాలంలో ఆరోగ్యానికి మేలు...



ములుగు ప్రతినిధి, మార్చి 22 (మెట్రో ఉదయం):
ములుగు జిల్లా ములుగు మండలంలోని ఇంచెర్ల గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికులు రాష్ట్ర మంత్రి శ్రీమతి సీతక్కను. ఆదివారం మర్యాదపూర్వకంగా కలసి, వేసవి కాలంలో లభించే సహజసిద్ధమైన పండ్లలో ఒకటైన ముంజకాయలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కార్మికుల ఆత్మీయతకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ముంజకాయలు వేసవి కాలంలో ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే సహజ శీతల పండ్లని పేర్కొన్నారు. వీటిలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల శరీరాన్ని చల్లగా ఉంచి డీహైడ్రేషన్ నుంచి రక్షిస్తాయని తెలిపారు. ముంజకాయలు తినడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభించడమే కాకుండా జీర్ణక్రియ మెరుగుపడుతుందని వివరించారు. అలాగే, ముంజకాయల్లో విటమిన్లు, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉండటంతో రోగనిరోధక శక్తి పెరుగుతుందని, చర్మ ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయని మంత్రి పేర్కొన్నారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా కలిగే అలసట, దాహం, శరీర వేడి వంటి సమస్యలను తగ్గించడంలో ముంజకాయలు సహాయపడతాయని తెలిపారు. ప్రజలు వేసవి కాలంలో సహజసిద్ధమైన పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మంత్రి సీతక్క గారు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు మరియు కార్మికులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి

- బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కెపి.వివేకానంద్..



కుత్బుల్లాపూర్ మార్చి 22 (ఉదయం ప్రతినిధి):
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి దుండిగల్ మున్సిపాలిటీ దుండిగల్ హెచ్ఎంటి ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన మినీ కమ్యూనిటీ హాల్ మరియు స్వాగత తోరణ నిర్మాణ పనులకు బిఆర్ఎస్ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీల అభివృద్ధికి,ప్రజల సామాజిక కార్యక్రమాలకు కమ్యూనిటీ హాళ్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. సొసైటీ సభ్యులు సమిష్టిగా ముందుకు వచ్చి ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని, భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తుడుం పద్మారావు,మాజీ కౌన్సిలర్లు శంబిపూర్ కృష్ణ,జక్కుల కృష్ణ యాదవ్, గోపాల్ రెడ్డి, జక్కుల శ్రీనివాస్, మాదాస్ వెంకటేష్ అనంతస్వామి, శంకర్ నాయక్, నాగరాజు, సుధాకర్ రెడ్డి, భరత్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ప్రెసిడెంట్ ఎండి అంజాద్ షాహిన్ వైస్ ప్రెసిడెంట్ టీవీ సత్యనారాయణ, సెక్రటరీ పండరీ, ట్రెజరర్ వికాస్ కుమార్, డైరెక్టర్లు తులసి దాస్, కళావతి, దివ్య జ్యోతి, అనంత రాములు, శ్రీశైలం మురళి గౌడ్, మల్లేశం, సూర్యప్రకాష్, పి.ఏ.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# "కాలనీ అభివృద్ధికి శ్రీకారం: ఓపెన్ జిమ్, బోర్‌వెల్‌తో గన్ రాక్ టీచర్స్ కాలనీకి కొత్త ఊపిరి"



కంటోన్మెంట్, మార్చి 22 (మెట్రోఉదయం)
నవ కంటోన్మెంట్ అభివృద్ధి దిశగా కీలక అడుగులు వేస్తూ, స్థానిక ప్రజల అవసరాలకు తక్షణ స్పందన చూపిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ మరోసారి ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. నియోజకవర్గంలోని వార్డు 7 గన్ రాక్ టీచర్స్ కాలనీలో ఓపెన్ జిమ్ తో పాటు నూతన పవర్ బోర్‌వెల్‌ను ఆదివారం ప్రారంభించారు. ఇటీవల కాలనీలో పర్యటించిన సమయంలో నివాసితులు తమ పార్క్‌ను అభివృద్ధి చేయాలని, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్‌వెల్ అవసరమని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికి వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో అంచనాలు సిద్ధం చేయించి, కంటోన్మెంట్ బోర్డు అనుమతులతో రాష్ట్ర ప్రభుత్వ నిధుల ద్వారా పనులను పూర్తి చేయించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తో పాటు స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు తమ అవసరాలను తీర్చిన ఎమ్మెల్యేకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... "కాలనీ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడం నా బాధ్యత. అని అందరూ ఐక్యంగా, ఆనందంగా జీవిస్తూ అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను. మీ ఆశీస్సులు ఎల్లప్పుడూ నాపై ఉండాలి" అని కోరారు. ఈ కార్యక్రమంలో మురళి ముదిరాజ్, నాగినేని సరిత, రంగా రవీందర్ గుప్తా తదితర కాంగ్రెస్ నాయకులతో పాటు కాలనీ వాసులు నవీన్, ప్రభు, అశోక్, గోకుల్, జూడ్ పాల్గొన్నారు.



# భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లితండ్రులదీ




- బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కే.పీ.వివేకానంద్..

కుత్బుల్లాపూర్ మార్చి 22 (ఉదయం ప్రతినిధి):
జీడిమెట్ల డివిజన్ పరిధిలోని జీడిమెట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఢిల్లీ గ్లోబల్ స్కూల్ వారి మొదటి బ్రాంచ్ ని బిఆర్ఎస్ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన స్కూల్ ప్రాంగణాన్ని పరిశీలించి,విద్యార్థులకు అందిస్తున్న విద్యా సదుపాయాలపై నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలు కలిగిన విద్యాసంస్థలు సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని తెలిపారు. భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లితండ్రులది అని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో బోయిన్పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్, విద్యాసంస్థ డైరెక్టర్లు పేట నాగూర్ బాబు, శశికాంత్ శర్మ, పేట దివ్య భారతి,రేఖ శర్మ బిఆర్ఎస్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కాలే నాగేష్, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, గొరిగే బాలప్ప, తోకల నాగేశ్ రెడ్డి, సమ్మేట ఎల్లా గౌడ్, కాలే గణేష్, అడప శేషు, స్కూల్ యాజమాన్యం పాల్గొన్నారు.




# కార్మికులను, పేదలను గాలి కొదిలేసిన రాష్ట్ర బడ్జెట్..

- కుత్బుల్లాపూర్ సిఐటియు మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్..




కుత్బుల్లాపూర్ మార్చి 22 (ఉదయం ప్రతినిధి):
రాష్ట్ర బడ్జెట్లో సంక్షేమ రంగాలకు నిధుల కోతకు నిరసనగా షాపూర్ నగర్ లో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన.ఈ కార్యక్రమంలో పాల్గొన్నా కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో సంక్షేమ రంగాలకు ప్రభుత్వం కోత పెట్టింది. ప్రభుత్వం ప్రతిపాదిత బడ్జెట్‌ను సవరించి ఆయా తరగతులకు న్యాయం చేయాలని.రూ.3,24,233 కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థికమంత్రి ప్రవేశపెట్టారని 2025-26లో బడ్జెట్‌లో రూ.3,04,000 కోట్లకు పైగా ప్రతిపాదన పెట్టి దాదాపు రూ.26వేల కోట్లు ఖర్చు పెట్టలేదని ఈ బడ్జెట్ కూడా అదే విధంగా ఉందని ఆరు గ్యారెంటీల అమలుకు ఎలాంటి నిర్దిష్టమైన ప్రతిపాదనలు లేవని పేర్కొన్నారు. రైతు భరోసా కు రూ. 25 వేల కోట్లు అవసరముంటే, రూ.18 వేల కోట్లు మాత్రమే ప్రతిపాదించారని మహాలక్ష్మి పథకానికి మహిళలకు రూ.2,500 ఊసే లేదని తెలిపారు. రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలకుపైగా ఇండ్లు లేనివారుంటే, ఈ బడ్జెట్‌లో కేవలం రూ.5,500 కోట్లు మాత్రమే ప్రతిపాదన చేశారని తెలిపారు. గృహ నిర్మాణానికి గతం కంటే కూడా ప్రస్తుత బడ్జెట్‌లో 1,344 కోట్లు కోత పెట్టారూ.

విద్యుత్ రంగానికి రూ.326 కోట్లు తగ్గించారనీ, మైనారిటీల, వెనుకబడిన తరగతుల, గిరిజనుల సంక్షేమానికి కేటాయింపులు లేవని ఎస్సీ, ఎస్టీలకు గత ప్రభుత్వం దళిత బంధు కింద రూ.10లక్షల చొప్పున ఇస్తామనగా, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.12 లక్షలు ఇస్తామని చెప్పిందని కానీ.బడ్జెట్‌లో కనీసం ఆ ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు ఉపాధి, నిరుద్యోగ భృతి ప్రస్తావన లేదనీ, విద్యా, వైద్యం ప్రయివేటీకరణను అరికట్టాలంటే నిధులు కేటాయింపులు చేసి ప్రభుత్వ రంగంలో దీన్ని బలపరచాలని కానీ నిధులు నామ మాత్రంగా పెంచినట్టుగా చూయించారూ వాస్తవానికి విద్యా,వైద్యాన్ని ప్రయివేటీకరణ నుంచి అరికట్టడానికి అవి ఏమాత్రం సరిపోవని, నిధులు పెంచాలని అన్నారు. విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలు మెరుగుపడడానికి, దళిత, గిరిజన, బలహీన వర్గాల, మైనారిటీల సంక్షేమానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పసుల అంజయ్య, శ్రీశైలం, స్వాతి, యాదవ రెడ్డి, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ వెంకటేశ్వర,శివ, వీరాంజనేయ ఆలయ 22వ వార్షికోత్సవాలు..



కుత్బుల్లాపూర్ మార్చి 22 (ఉదయం ప్రతినిధి):
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల గ్రామంలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ వెంకటేశ్వర, శివ, వీరాంజనేయ ఆలయ 22వ వార్షికోత్సవ మహోత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్, డా.అవిజే జేమ్స్, బేకు శ్రీనివాస్, సిద్దనోల సంజీవరెడ్డి, మైసిగారి శ్రీనివాస్, పండరి రావు,ప్రవీణ్ ముదిరాజ్ శ్రీనివాస్, సుజాత యాదవ్, జ్యోతి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మద్యం అమ్మితే సంక్షేమ పథకాలు కట్..



ములుగు ప్రతినిధి, మార్చి 22 (మెట్రో ఉదయం):
ములుగు జిల్లా తాడ్వాయి మండలం గోనెపల్లిలో ఆదివారం సంపూర్ణ మద్యపానాన్ని నిషేధిస్తూ గ్రామస్థులు తీర్మానం చేశారు. గ్రామసభ నిర్వహించి గ్రామంలో ఎవరైనా మద్యం, గుడుంబా తదితర మత్తు పానీయాలు విక్రయిస్తే ఆ కుటుంబానికి ప్రభుత్వ పథకాలు, రేషన్ బియ్యం, సంక్షేమ పథకాలపై ఆంక్షలు విధిస్తామని గ్రామస్థులు తీర్మానంలో పేర్కొన్నారు. ఈ నిబంధనలు అతిక్రమిస్తే వారింట్లో శుభకార్యాలకు, దిన కార్యాలకు సహకరించకూడదని తెలిపారు. గ్రామస్తులు చేసిన ఈ తీర్మానాన్ని పలువురు అభినందనలు తెలుపుతున్నారు


## బిజెపిని బలోపేతం చేయాలి.......

- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా రవికుమార్...



హనుమకొండ, మార్చి 22 ( మెట్రో ఉదయం):
భారతీయ జనతా పార్టీ గోపాలపురం, జోనల్ కమిటీ ప్రశిక్షణా తరగతులు జోనల్ అధ్యక్షుడు బండి హరీష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో భీమారం 55వ డివిజన్లోని ఒక ప్రైవేటు కాలేజీలో నిర్వహించడం జరిగింది. శనివారం సాయంత్రం నాలుగు గంటల నుండి ఆదివారం సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమానికి ప్రధాన వక్తగా వరంగల్ జిల్లా బిజెపి అధ్యక్షులు గంటా రవికుమార్ అలాగే బూతు స్థాయి నుండి పార్టీ నిర్మాణము ఎలా చేయాలనే అంశం పైన మరొక జిల్లా కార్యదర్శి రాయపూరపు కుమారస్వామి, సోషల్ మీడియాను ఎలా వాడుకోవాలి అనే అంశం పైన ఆడెపు వెంకటేశ్వర్లు, కార్య నిర్వహణ పద్ధతి గురించి, సుల్తాన్ రాజు మాట్లాడారు. అలాగే బిజెపి పార్టీ యొక్క చరిత్ర దాని నిర్మాణం గురించి జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్ చాలా విశ్లేషణాత్మకంగా వివరించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో, ఎస్సీ మోర్చా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తాడం రాజేందర్, మండల ప్రధాన కార్యదర్శి పప్పుల రమేష్, ప్రధాన కార్యదర్శి బుచ్చి రాములు, మండల ప్రశిక్షణా కమిటీ కన్వీనర్ నాతి రమేష్ ,మండల ఉపాధ్యక్షులు వల్లాల శ్రీధర్ , కాయితోజు అఖిలేష్, కార్యదర్శి బండారు కుమార్, చింత ప్రకాష్, ఓబీసీ మోర్చా కార్యాలయ కార్యదర్శి అలుగునూరి కృష్ణంరాజు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు పోలంపల్లి బాలరాజు, ఎస్సీ మోర్చా జోనల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తుల నాగరాజు,సతీష్, ఎస్టి మోర్చా జోనల్ అధ్యక్షులు గుగులోత్ హుస్సేన్ నాయక్, బొద్దిరెడ్డి సురేందర్ రెడ్డి, వెంకట్రాజ్యం, అల్లం శ్యామ్, రాయబారం కిషన్, జగన్, మద్దునూరి శ్రీనివాస్, సూరం రంజిత్, సిహెచ్ రాజు, ఆరే రోహిత్ రెడ్డి, వెంకట్రాజ్యం, బుద్ధి రెడ్డి ప్రభాకర్ రెడ్డి, ముల్కోజుల చంద్రమౌళి, ఎల్లావుల లింగమూర్తి,గుంటి నవీన్, యు.కిరణ్ కుమార్, ఓరం ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

## రామప్పలో అద్భుత దృశ్యం!



ములుగు ప్రతినిధి , మార్చి 22 మెట్రో ఉదయం
ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం ప్రసిద్ధ రామప్ప దేవాలయం శిఖరంపై ఉన్న కలశాన్ని తాకుతూ ఉదయించే సూర్యుడు అపూర్వ దృశ్యాన్ని సృష్టించాడు. ఆ క్షణాన్ని ప్రధాన అర్చకుడు హరీశ్ శర్మ తన చరవాణిలో బంధించారు. భానుడి కిరణాలు ఆలయ శిల్ప సౌందర్యాన్ని మరింత ప్రతిబింబింపజేస్తూ భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఈ అరుదైన దృశ్యం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# ప్రేమ్ సదన్ వృద్ధాశ్రమంలో అల్పాహార పంపిణీ

- ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

జనగామ-కొడకండ్ల, మార్చి 22(మెట్రో ఉదయం జిల్లా ప్రతినిధి )
జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సీతారామపురం గ్రామంలోని ప్రేమ్ సదన్ వృద్ధాశ్రమంలో ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొడకండ్ల మండలం రంగాపురం గ్రామానికి చెందిన వల్లూరి ఉపేందర్ వృద్ధాశ్రమంలో నివసిస్తున్న 20 మంది వృద్ధులకు ఉదయం అల్పాహారంగా వారికి ఇష్టమైన టిఫిన్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వల్లూరి ఉపేందర్ మాట్లాడుతూ, ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ అధ్యక్షులు పెదపూడి ప్రసన్న కుమార్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను యూట్యూబ్ ద్వారా చూసి ప్రేరణ పొందానని తెలిపారు. ఆ ప్రేరణతో తాను కూడా చిన్న స్థాయిలో సేవా కార్యక్రమాలు ప్రారంభించానన్నారు. హైదరాబాద్‌లో కాళ్లు లేక నేలపై సాగుతున్న ఒక నిరుపేద వ్యక్తిని గమనించి, అతని





ఆకలిని తీర్చిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ, ఇప్పటి వరకు ముగ్గురు అభాగ్యుల ఆకలిని తీర్చగలిగినందుకు తనకు ఎంతో తృప్తి కలిగిందన్నారు. ఈ రోజు వృద్ధులకు సేవ చేసే అవకాశం కల్పించిన ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఫౌండేషన్ అధ్యక్షులు పెదపూడి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, కొడకండ్ల మండలంలోని ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ వాట్సాప్ గ్రూప్ సభ్యులు వారానికి ఒక్కరు చొప్పున ముందుకు వచ్చి వృద్ధులకు సేవ చేయాలని ఆసక్తి చూపడం అభినందనీయమన్నారు. ఈ విధంగా ముందుకు వచ్చిన దాతలను ప్రశంసిస్తూ, ఇంకా మరింత మంది దాతలు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమాజంలో మానవత్వాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు. ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ ద్వారా ప్రతి వారం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వారు అభినందించారు.

# ప్రభుత్వ వివక్షకు నిరసనగా...25న జర్నలిస్టుల"ఛలో హైదరాబాద్"

హైదరాబాద్, మార్చి 22: (మెట్రోఉదయం)
జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబభిస్తున్న నిర్లక్ష్యవైఖరి, వివక్ష ధోరణికి నిరసనగా ఈ నెల 25వ తేదీన రాష్ట్రవ్యాప్త జర్నలిస్టుల"ఛలో హైదరాబాద్- ఐ అండ్ పీఆర్ ఆఫీస్" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో జర్నలిస్టులను పూర్తిగా విస్మరించిందని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల తీవ్రమైన వివక్ష చూపుతుందని చెప్పడానికి మొన్న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెటే నిదర్శనమని అన్నారు. బడ్జెట్ లో జర్నలిస్టుల సంక్షేమం ఊసే లేకపోవడం, కనీసం జర్నలిస్టుల సంక్షేమం గురించి ఒక్క మాట కూడా చెప్పకపోవడం దారుణమని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇంతవరకు ఇవ్వలేదని, హెల్త్ కార్డులు సైతం ఇవ్వలేకపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల ఊసే లేదని, సుప్రీం కోర్టు తీర్పు సాకుతో ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా తప్పుకుంటుందని ఆరోపించారు. మీడియా అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్ వేయలేదని, పదవీవిరమణ పొందిన పాత్రికేయులకు అనేక రాష్ట్రాలలో పెన్షన్ ఇస్తుండగా, మన రాష్ట్రంలో ఏ ఒక్కరికీ ఇవ్వడంలేదని అన్నారు. చిన్న, మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్ ను పూర్తిగా అణిచివేస్తున్నదని, గత రెండేళ్లుగా అడ్వర్టైజ్మెంట్స్ బిల్స్ చెల్లించడం లేదని ధ్వజమెత్తారు. ఆర్ ఎన్ ఐ, పీఆర్ జిఐ రిజిస్ట్రేషన్ తో నడుస్తున్న అనేక చిన్న, మధ్య తరహా పత్రికలను ఎంపానల్మెంట్ చేయడం లేదని, కనీసం ఆ పత్రికలకు అక్రెడిటేషన్ కార్డులు కూడా ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో జర్నలిస్టులకిచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని, జర్నలిస్టుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు తీసుకోకుండా వివక్ష చూపుతూ నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారని మామిడి సోమయ్య ధ్వజమెత్తారు.ఈ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 25న తలపెట్టిన "ఛలో హైదరాబాద్-ఐఅండ్ పీఆర్ ఆఫీస్" ఆందోళన కార్యక్రమంలో రాష్టవ్యాపితంగా జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## నీటి సంరక్షణ అందరి బాధ్యత : మంత్రి సీతక్క




ఆత్మకూరు,మెట్రోఉదయం, హన్మకొండజిల్లా
మానవాళికి జీవధారైన నీటిని సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని రాష్ట్ర గ్రామీణ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం ఆత్మకూరు మండలం తిరుమలగిరి గ్రామంలో అంతర్జాతీయ జల్ మహోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్క,స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్బంగా సీతక్క మాట్లాడుతూ మనిషి జీవన విధానంలో నీరు అతిముఖ్యమైందని ప్రజలు స్వచ్ఛమైన నీళ్ళు తాగడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనం సాగిస్తారని ప్రభుత్వం మిషన్ భగీరథ పథకంతో ప్రతి పల్లెకు శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తుందని,దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్ వో ప్లాంట్ నీటిలో పోషకాలు లభించవని ఈ నీటిని తాగడం ద్వారా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, సర్పంచ్ దేవేంద్ర, ఆత్మకూరు సర్పంచ్ మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.


త్వరలో గ్రామ మహోత్సవాలు నిర్వహిస్తాం త్వరలో రాష్టంలోగ్రామ మహోత్సవాలు నిర్వహిస్తామని మంత్రి సీతక్క ఈ సందర్బంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంతో దాతలు సహాయంతో గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారుల పని తీరు పై ఎమ్మెల్యే అసంతృప్తి జల్ మహోత్సవం కార్యక్రమం సందర్బంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ అధికారుల పని తీరు పై అసంతృప్తి వ్యక్తం చేశారు, ప్రజలకు ప్రభుత్వం అంతరాయం, స్వచ్ఛమైన నీరు అందించేందు ప్రభుత్వం నిధులు ఇస్తున్న ఆర్డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ,పోచమ్మ దేవాలయ 35వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్..



కుత్బుల్లాపూర్ మార్చి 22 (ఉదయం ప్రతినిధి):
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధి వెన్నెల గడ్డ లో శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ,పోచమ్మ దేవాలయ 35వ వార్షికోత్సవ మహోత్సవం సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బీజేపీ మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి..

## రామప్ప దేవాలయంను సందర్శించిన నెదర్లాండ్ దేశస్తులు



ములుగు ప్రతినిధి, మార్చి 22( మెట్రో ఉదయం ):
ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయాన్ని ఆదివారం నెదర్లాండ్ దేశానికీ చెందిన సైమన్, జూలీయన్ లు సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో పూజలు నిర్వహించగా ఆలయ అర్చకులు హరీష్ శర్మ ఉమాశంకర్లు తీర్థప్రసాదాలు అందజేశారు. రామప్ప చరిత్ర శిల్పకళ ప్రాముఖ్యతను టూరిజం గైడ్ గోరంట్ల విజయకుమార్ వారికి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ శిల్పకళ చాలా బ్యుటిపుల్ గా ఉందని కొనియాడారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. వారి వెంట టూరిస్ట్ పోలీసులు శ్రీనివాస్, బద్రు, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది ఉన్నారు.

# అడవుల సంరక్షణతోనే సుస్థిర భవిష్యత్తుకు పునాది

- **స్వచ్ఛమైన ప్రాణవాయువుకు అడవులే మూలాధారం.**
- **ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి.**
- **అడవుల సంరక్షణ అందరి బాధ్యత.**
- **రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క.**

ములుగు ప్రతినిధి, (కూనూరు మహేందర్ గౌడ్), మార్చి 22 (మెట్రో ఉదయం):




అడవుల సంరక్షణతోనే సుస్థిర భవిష్యత్తుకు బలమైన పునాది లభిస్తుందని,స్వచ్ఛమైన ప్రాణవాయువుకు అడవులే మూలాధారంగా ఉంటాయని,ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలను నాటాలని,అడవుల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.ఆదివారం గోవిందరావు పేట మండలం పస్రా అటవీ శాఖ కార్యాలయంలో ప్రపంచ అటవీ దినోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన అడవుల సంరక్షణ - ఆవశ్యకత అవగాహన ర్యాలీ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, డి ఎఫ్ ఓ రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ స్వచ్ఛమైన ప్రాణవాయువుకు అడవులే మూలాధారమని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మొక్కలను నాటాలని అడవుల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన జిల్లాగా ములుగు జిల్లా ప్రథమ స్థానంలో ఉందని స్పష్టం చేశారు. పంటలు సమృద్ధిగా పండాలన్న రైతులకు సరిపడా వర్షపాతం నమోదు కావాలన్నా అడవులే కీలక పాత్ర పోషిస్తాయని అడవులు అంతరించిపోతే మానవ మనుగడ సైతం అంతరించిపోతుందని తెలిపారు. చతిస్గడ్ ప్రాంతంలో ఇప్ప చెట్లను దైవంగా భావిస్తూ వాటిని అక్కడి ప్రజలు సంరక్షించుకుంటారని అన్నారు. అడవుల ద్వారా గిరిజనులకు గిరిజనేతరులకు అనేక లాభాలు ఉంటాయని స్థానిక గిరిజనులు సైతం అటవీ ఉపాధి పొందుతున్నారని అన్నారు. అడవిని సంరక్షించడంలో అటవీ శాఖ అధికారులకు స్థానిక ప్రజలు యువకులు సహాయ సహకారాలు అందించినప్పుడు పూర్తిస్థాయిలో అడవుల రక్షణ సాధ్యమవుతుందని తెలిపారు.

కొంతమంది స్వలాభం కోసం వేసవి కాలంలో అడవులకు నిప్పు పెట్టడం వల్ల మొక్కలు, ఔషధ గుణాలున్న చెట్లు కాలిపోతున్నాయని, వన్యప్రాణులను వేటాడడం, చెట్లను నరకడం వంటి కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ములుగు జిల్లా ప్రకృతి రమణీయమైన జిల్లాగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుందని ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతాలు దట్టమైన అటవీ ప్రాంతాలలో ఉండటంతో అనేకమంది పర్యాటకులు ములుగు జిల్లా అందాలను తిలకించడానికి వస్తున్నారని తెలిపారు. అటవీ దినోత్సవం వేడుకలకే పరిమితం కాకూడదని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు, రోడ్డు పక్కన, చెరువు గట్ల వెంట మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మంత్రి కోరారు. ములుగు జిల్లాను అటవీ సంరక్షణలో దేశానికే ఆదర్శంగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధిక అడవి శాతం కలిగిన జిల్లాగా ములుగు జిల్లా ప్రథమ స్థానంలో ఉందని స్పష్టం చేశారు.స్వచ్ఛమైన ప్రకృతి రమణీయమైన వాతావరణం ములుగు ప్రాంతంలో కలిగి ఉంటుందని అన్నారు. అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన ప్రాణవాయువు అందించాలంటే అడవులే కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.అడవుల విస్తీర్ణం పెంచడం ద్వారా గ్లోబల్ వార్మింగ్ లాంటి సమస్యలను అరికట్టవచ్చని అన్నారు. అనంతరం జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ మాట్లాడుతూ ములుగు ప్రాంతం అధిక అటవీ విస్తీర్ణం కలిగి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉన్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. అడవుల సంరక్షణ ప్రథమ కర్తవ్యం గా అటవీ సిబ్బంది విధులు నిర్వర్తించాలని సూచించారు. ఉద్దేశపూర్వకంగా అడవులకు ముప్పు వాటిల్లే చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. వైల్డ్ లైఫ్ అభయారణ్యంలో బ్లాక్బెర్రీ ఐలాండ్, తాడ్వాయి హాట్స్, జంగిల్ సఫారీ, బంధాల వ్యూ పాయింట్ వంటి పర్యాటక ప్రాంతాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయని తెలిపారు.




అనంతరం అడవుల సంరక్షణ - ఆవశ్యకత అవగాహన ర్యాలీ కార్యక్రమంలో మంత్రి అనసూయ సీతక్క,జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, డి ఎఫ్ ఓ రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి పాల్గొన్నారు. అనంతరం పసర గ్రామంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో 35 లక్షల రూపాయల నిధులతో రాజీవ్ కాలనీ కి అంతర్గత సిసి రోడ్ నిర్మాణ పనులకు మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ అంతర్గత సిసి రోడ్డు లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనే వారని వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం గ్రామాలలో అంతర్గత సిసి రోడ్లను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడత పంపిణీ కార్యక్రమం ప్రారంభం అవుతుందని అర్హులైన ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతుందని ప్రతి ఒక్క మహిళ మహిళా సంఘంలో సభ్యురాలుగా ఉండాలని దీనిద్వారా అనేక లాభాలు సమకూరుయని, త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డ్ మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, శిక్షణ ఐ ఎఫ్ ఎస్ ప్రధమేష్ కేశవ్, తాడ్వాయి ఎఫ్ డి ఓ వజ్రారెడ్డి, ఏటూర్ నాగారం ఎఫ్ డి ఓ రమేష్, పసర సర్పంచ్ సుమలత, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, అటవీ శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం..!

- **రైతు భరోసా నిధులు విడుదల.**
- **రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి.**
- **తొలివిడత 70 లక్షల మంది ఖాతాలకు రైతుభరోసా.**
- **ఎకరం వరకు ఉన్న రైతులకు రూ.3,600 కోట్లు విడుదల**

ఉదయం, జనగామ ప్రతినిధి: (కమ్మగాని రమేష్ గౌడ్, సీనియర్ జర్నలిస్టు):

రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రైతు సంక్షేమ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కన్నా, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కొరకు ఆలోచన చేసి, రైతులు బాగుండాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఆదివారం కావడంతో రైతుల ఖాతాల్లోకి రేపు(సోమవారం) నిధులు జమకానున్నాయి.మరో 20 రోజుల చొప్పున మిగతా రూ.5,400 కోట్లు జమకానున్నాయి. మరో 2 విడతల్లో రూ.2,700 కోట్లు చొప్పున రైతు భరోసా నిధులు జమకానున్నాయి. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. సిద్దిపేటలో ఏర్పాటు చేసిన రైతు ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. గతం కంటే రైతు భరోసా నిధులు పెంచామని స్పష్టం చేశారు.



## రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం..!

రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గతం కంటే రైతు భరోసా నిధులు పెంచామని తెలిపారు. పంటలకు మద్దతు ధరతో సహా రూ.500 బోనస్ ఇస్తున్నామని ఉద్ఘాటించారు. ఆర్థిక ఇబ్బందులున్నా అన్ని పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతినెలా రైతుల సంక్షేమం కోసం రూ.5,500 కోట్ల వ్యయం అవుతుందని చెప్పుకొచ్చారు. 20 నెలల్లో రైతుల కోసమే రూ.లక్షా 40 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు.పంట సాగులో తెలంగాణ అగ్రస్థానంలోలి .. ప్రతి పంట సాగులో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రూ.750 కోట్లతో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మించామని ప్రస్తావించారు. 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ పండించినా కొంటామని తెలిపారు. కొడంగల్‌లోనూ పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మిస్తామని వెల్లడించారు. రైతుల ఆదాయం పెరగాలంటే వరి ఒక్కటే మార్గం కాదన్నారు. రైతులు పంటల మార్పిడికి కృషి చేయాలని సూచించారు. పంటల మార్పిడికి రైతులను తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అన్నారు.




పంటల మార్పిడితో రైతులకు మంచి ధర వచ్చేలా చూస్తామని భరోసా కల్పించారు. మిల్లెట్స్, ఆకు కూరలు, పామాయిల్ సాగుపై అన్నదాతలు దృష్టి పెట్టాలని సూచించారు. పామాయిల్ సాగుతో రైతుల ఆదాయం పెరుగుతుందన్నారు. ప్రతి పంచాయతీ అంకాపూర్‌లా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రతి రైతు కారు కొనుక్కునేలా ఆదాయం పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.ప్రభుత్వ బడుల్లో అన్నిరకాల వసతులు కల్పిస్తామని అన్నారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళలను వ్యాపారులుగా తీర్చిదిద్దుతున్నామనిలి చెప్పుకొచ్చారు. ఒకప్పుడు అదానీ, అంబానీ వంటివారు మాత్రమే సౌర విద్యుత్ వ్యాపారం చేసేవారని అన్నారు. తమ ప్రభుత్వం మహిళలతో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయించిందని ప్రస్తావించారు. మహిళల పేరుతోనే అన్ని సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామని చెప్పుకొచ్చారు. పిల్లలను ప్రైవేట్ బడుల్లో చదివించాలనే ఆలోచన చేయొద్దని అన్నారు. ప్రభుత్వ బడుల్లో అన్నిరకాల వసతులు కల్పిస్తున్నామనిలి ఉద్ఘాటించారు. విద్యార్థులకు పాలు, రాగి, జావ, పౌష్టికాహారం అందిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## కాలనీ అభివృద్ధి కొరకు సంక్షేమ సంఘాలు చురుకుగా పనిచేయాలి : బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్..



కుత్బుల్లాపూర్ మార్చి 22 (ఉదయం ప్రతినిధి):

ఎం.ఎన్. రెడ్డి నగర్ కాలనీ ఫేజ్--1 వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన లెటర్ హెడ్ ను ఆవిష్కరించిన బిఆర్ఎస్ఎల్పీ విప్,ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆదివారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయ వద్ద ఎం.ఎన్.రెడ్డి నగర్ కాలనీ ఫేస్ -1 వెల్ఫేర్ అసోసియేషన్ వారి నూతన లెటర్ ప్యాడ్ ని ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ.. కాలనీల అభివృద్ధిలో వెల్ఫేర్ అసోసియేషన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రజల సమస్యలను సమిష్టిగా పరిష్కరించేందుకు మరియు కాలనీ అభివృద్ధి కోసం ఇటువంటి సంఘాలు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సంపత్ గౌడ్,ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, ట్రెజరర్ కరుణాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బిక్షపతి విజయ్,వర్కింగ్ జనరల్ సెక్రెటరీ పరమేశ్వర్, అడ్వైజర్సత్య రామ్, రవి, శ్రీనివాస్, నాగేశ్వరరావు, ప్రసాద్, ప్రతాప్ రెడ్డి, రామిరెడ్డి,బాబి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ నగర అభివృద్ధి బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యం : బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కెపి.వివేకానంద్..



కుత్బుల్లాపూర్ మార్చి 22 (ఉదయం ప్రతినిధి):

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి సుభాష్ నగర్ డివిజన్ (292 డివిజన్) పరిధి సూరారం బస్ స్టాప్ వద్ద నిర్వహించిన పార్టీ చేరికల కార్యక్రమంలో భాగంగా ఉద్యమకారుడు,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు యూ.సాయి,భరత్ వారి మిత్రబృందం సభ్యులు,అదేవిధంగా రాజీవ్ గృహకల్ప కు చెందిన అందెం రాజేష్ మరియు వారి మిత్రబృందం సభ్యులు బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాబ్ నగర అభివృద్ధి బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని,బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే హైదరాబాద్ నగరం తో పాటు తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో ఇటు అభివృద్ధి,అటు సంక్షేమ పథకాలతో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు.చత్రపతి శివాజీ యూత్ సభ్యులు రాహుల్, రాము,పవన్, చంటి, కిషోర్, లడ్డు, ప్రవీణ్, నవీన్, టి.సాయి, వెంకట్, మణి, వెంకట సాయి, కె.హరి, రాజేష్, సూరజ్..

రాజీవ్ గృహకల్ప :- అందెం రాజేష్, రామకృష్ణ, మహేందర్, హేమంత్, రాకేష్, శ్రీకాంత్, వంశీ, వినయ్ కుమార్. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు రాజ్ కుమార్, తారా సింగ్, వలీ బాయ్, గుబ్బల లక్ష్మీ నారాయణ, కరాటే శ్రీను, రాజు, మైత్రి నగర్ రాజు, సత్యనారాయణ గౌడ్, కిషోర్ ముదిరాజ్, బైరేష్ గౌడ్, మహేష్ గౌడ్, చందు, వేణు, అనిల్, మునీర్, జహీర్, మిరాజ్, కావాలి రవి, కట్టా సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ వేముల వీరేశంకు సత్కారం...



చిట్యాల, నల్లగొండ: మార్చి 22(మెట్రో ఉదయం):

రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా నియామకమైన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను ఆదివారం పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేను సత్కరించిన వారిలో ఐఎన్టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు కామాటి లింగయ్య, ఉరుమడ్ల గ్రామానికి చెందిన ఏఎంసీ డైరెక్టర్ కోనేటి యాదగిరి, పల్లపు బద్దుడు, గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్ రెడ్డి, శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ బుస్సు శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ్మా, మాజీ సీఎసిఎస్ చైర్మన్ అంతటి శ్రీనివాస్, తాళ్ళవెల్లెం గ్రామ సర్పంచ్ జోగు సురేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు మేడి శంకర్, ఎరసాని గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## బియ్యం అందజేత...



చిట్యాల, నల్లగొండ: మార్చి 22 (మెట్రో ఉదయం):

చిట్యాల పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన దాసరి నర్సింహ్మా భార్య పద్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషాద ఘటనతో బాధలో ఉన్న కుటుంబాన్ని ఆదివారం సీయోను ప్రార్థన మందిరం సభ్యులు పరామర్శించి ఆర్థికంగా ఆదుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి క్వింటాళ్ల బియ్యం అందజేశారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి, అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రైస్తవ సంఘం అధ్యక్షుడు పోకల అశోక్, జాన్ ప్రకాష్, పోకల శ్యామూల్, పోకల యేసురత్నం, తిమోతి, శ్రీను, విజయ్, మోబీన్, గణేష్, అనిల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో కోకుమ్ జ్యూస్ లేదా ఉసిరి కాయ జ్యూస్.. రెండింటిలో దేన్ని తీసుకుంటే ఎక్కువ ఫలితం ఉంటుంది..?



వేసవి వేడి ఎక్కువగా పెరుగుతున్న సమయంలో ప్రజలు శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి అనేక రకాల ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. ముఖ్యంగా శరీరాన్ని చల్లబరిచే పానీయాలను ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. వేసవిలో బయట మార్కెట్ లో లభించే శీతల పానీయాలకు బదులుగా సంప్రదాయ జ్యూస్ లను తీసుకోవడం మంచిది. వేసవిలో తీసుకోదగిన సహజ పానీయాల్లో కోకుమ్ జ్యూస్, ఉసిరి జ్యూస్ లు ముందు వరుసలో ఉంటాయని చెప్పవచ్చు. ప్రజలు కూడా వేసవిలో కోకుమ్ జ్యూస్, ఆమ్లా జ్యూస్ వంటి పానీయాలను ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. ఈ సంప్రదాయ సూపర్‌ఫుడ్స్‌తో తయారయ్యే ఈ జ్యూసులు శరీరానికి లోపల నుంచి చల్లదనం కలిగించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. కోకుమ్ పండ్లు, మొత్తం ఉసిరి కాయలు పోషకాలను అధికంగా కలిగి ఉంటాయి.

### తాజా జ్యూస్‌లను తీసుకోవడం శ్రేయస్కరం..

అయితే ప్రస్తుతం మార్కెట్లో సిరప్స్, పౌడర్ రూపంలో లభిస్తున్న జ్యూసులతో పోలిస్తే తాజా కోల్డ్-ప్రెస్డ్ జ్యూస్ లను తీసుకోవడం ఎక్కువ ప్రయోజనకరమని వైద్యులు చెబుతున్నారు. రెడీమేడ్ జ్యూసుల్లో కృత్రిమ రంగులు, రుచులు, రసాయనాలు ఉండే అవకాశం ఉంది. ఇవి ఆరోగ్య ప్రయోజనాలను తగ్గించవచ్చని కనుక తాజా జ్యూస్ లనే తీసుకునే ప్రయత్నం చేయాలని చెబుతున్నారు. అసలు వేసవిలో జ్యూస్ లను ఎందుకు తీసుకోవాలి.. కోకుమ్, ఉసిరి జ్యూస్ లలో ఏది శరీరానికి మేలు చేస్తుంది.. వంటి విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం. వేసవిలో జీర్ణవ్యవస్థ నెమ్మదిస్తుంది. అందుకే ఆహారాన్ని తక్కువగా తీసుకుంటారు. ఈ సమయంలో కోకుమ్ లేదా ఆమ్లా జ్యూస్ వంటి పానీయాలను తీసుకోవడం వల్ల శరీరానికి నీరు అందుతుంది. అవసరమైన పోషకాలు లభిస్తాయి. శరీరం లోపల నుంచి చల్లగా ఉంటుంది.

### కోకుమ్ జ్యూస్‌తో కలిగే లాభాలు..

ఇక కోకుమ్ జ్యూస్ ను కోకుమ్ పండుతో తయారు చేస్తారు. దీనిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అలాగే దీనిలో ఆంథోసైనిన్లు వంటి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇందులో గార్సినాల్ కూడా ఉంటుంది. ఇది యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను, శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. అలాగే దీనిలో హైడ్రాక్సీసిట్రిక్ యాసిడ్ వంటి ఆమ్లాలు కూడా ఉంటాయి. ఇవి జీర్ణశక్తిని మెరుగుపరచడంలో దోహదపడతాయి. అలాగే కొద్ది మొత్తంలో కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు కూడా ఇందులో ఉంటాయి. కోకుమ్ జ్యూస్ జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. వేసవిలో వచ్చే అలసటను తగ్గిస్తుంది.

### ఉసిరికాయ జ్యూస్ అయితే..

ఉసిరి జ్యూస్ కూడా పోషకాలను కలిగి ఉంటుంది. మార్కెట్లో లభించే ప్యాక్డ్ జ్యూసుల్లో ఆమ్లా శాతం తక్కువగా ఉండే అవకాశం ఉంది. కాబట్టి లేబుల్ చూసి తీసుకోవడం మంచిది. తాజా ఆమ్లా జ్యూస్‌లో విటమిన్ సి 600-700 ఎస్త్ర వరకు ఉంటుంది. అలాగే పాలీఫెనాల్స్, ఫ్లేవనాయిడ్స్ బలమైన యాంటీ ఆక్సిడెంట్ చర్యను అందిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి నుండి రక్షిస్తాయి. ఇందులో కాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్, పొటాషియం వంటి ఖనిజాలు కూడా ఉంటాయి. ఈ జ్యూస్ లో ఉండే అమినో యాసిడ్లు శరీర జీవక్రియకు మద్దతును ఇస్తాయి. ఉసిరి జ్యూస్ లో ఉండే ఫైబర్ జీర్ణక్రియకు మద్దతును ఇస్తుంది. ఇందులో క్యాలరీలు తక్కువగా ఉంటాయి కనుక రోజూ తీసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. ఉసిరి జ్యూస్ రోగనిరోధక శక్తిని పెంచి, శరీరానికి శక్తినిస్తుంది.

### దేన్ని తీసుకోవాలి..

కోకుమ్ జ్యూస్, ఉసిరి జ్యూస్ రెండూ కూడా ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కోకుమ్ జ్యూస్ శరీరాన్ని బాగా చల్లబరుస్తుంది. వేసవిలో వచ్చే జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. జీరా, ఉప్పు కలిపి ఈ జ్యూస్ ను తీసుకోవడం ఇంకా ప్రయోజనకరంగా ఉంటుంది. అదే విధంగా ఆమ్లా జ్యూస్ శరీరాన్ని హైడ్రేట్ చేస్తుంది. కొలెస్ట్రాల్ తగ్గించడంలో సహాయపడుతుంది. మెటబాలిజాన్ని మెరుగుపరుస్తుంది. రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. కోకుమ్ జ్యూస్ శరీరాన్ని చల్లగా ఉంచడంలో కొంచెం ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. ఆమ్లా జ్యూస్ మొత్తం ఆరోగ్యానికి ఎక్కువ ప్రయోజనాలను అందిస్తుంది. ఈ రెండు జ్యూసులు కూడా ఆరోగ్యానికి మంచివే. ఏ జ్యూస్ తీసుకోవాలన్నది సొంత నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

# ఈ యోగాసనాలను తరచూ వేస్తుంటే చాలు.. ఎలాంటి జీర్ణ సమస్యలు ఉండవు..



జీర్ణ సమస్యలైన ఉబ్బరం, మలబద్ధకం, నెమ్మదిగా పనిచేసే మెటాబాలిజం ఇవన్నీ ఈ రోజుల్లో చాలా సాధారణంగా మారుతున్నాయి. కూర్చుని పని చేసే జీవనశైలిని కలిగి ఉండడం, ఒత్తిడి, అసమయ భోజనం, జంక్ ఫుడ్ ను ఎక్కువగా తీసుకోవడం వంటివి ఈ సమస్యలకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. చాలా మంది తీసుకునే ఆహారం జీర్ణ ఆరోగ్యాన్ని కాపాడడంలో ముఖ్యమైన పాత్ర పోషించినప్పటికీ, కొన్ని యోగాసనాలు కూడా జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. యోగా రక్తప్రసరణను మెరుగుపరుస్తుంది. పొత్తికడుపు అవయవాలను ఉత్తేజితం చేస్తుంది. గట్-బ్రెయిన్ కనెక్షన్‌ను సమతుల్యం చేస్తుంది. నిరంతరం యోగా చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడడంతో పాటు గ్యాస్ సమస్య తగ్గుతుంది. మొత్తం పొట్ట ఆరోగ్యానికి యోగా ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. జీర్ణ ఆరోగ్యానికి ఉపయోగపడే యోగాసనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### పవనముక్తాసనం, భుజంగాసనం..

జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే యోగాసనాలల్లో పవనముక్తాసనం ఒకటి. ఈ ఆసనం జీర్ణక్రియను మెరుగుపరచడంలో, గ్యాస్ తగ్గించడంలో ఎంతో ఉపయోగపడుతుంది. ఈ ఆసనం వేయడం కూడా చాలా సులభం. ముందుగా మెత్తపై పడుకోవాలి. ఒక మోకాలు ఛాతీ వైపు తీసుకురావాలి. రెండు చేతులతో పట్టుకుని పొత్తికడుపుకు దగ్గరగా నొక్కాలి. కొన్ని సెకన్లు అలాగే ఉంచి, తర్వాత మరో కాలుతో ఇలాగే చేయాలి. ఈ ఆసనం పొత్తికడుపుపై ఒత్తిడి కలిగించి జీర్ణక్రియను ఉత్తేజితం చేస్తుంది. భుజంగాసనం వేయడం ద్వారా కూడా జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఈ ఆసనం పొత్తికడుపును స్ట్రెచ్ చేసి జీర్ణ అవయవాలను ఉత్తేజితం చేస్తుంది. ఈ ఆసనం వేయడానికి ముందుగా పొట్టపై పడుకోవాలి. తరువాత చేతులను భుజాల దగ్గర ఉంచాలి. మెల్లగా ఛాతీని పైకి లేపి, భుజాలను రిలాక్స్‌గా ఉంచాలి. ఇలా చేయడం వల్ల రక్తప్రసరణను మెరుగుపరచి జీర్ణక్రియకు సహాయం చేస్తుంది.

### అర్ధ మత్స్యేంద్రాసనం, పశ్చిమోత్తానాసనం..

అలాగే అర్ధ మత్స్యేంద్రాసనం కూడా ఎంతో మేలు చేస్తుంది. ఈ ఆసనం వెన్నెముకను మెలిపెడుతూ పొత్తికడుపు అవయవాలకు మసాజ్ లాంటిది ఇస్తుంది. ఈ ఆసనంలో ముందుగా కాళ్లు ముందుకు చాపి కూర్చోవాలి. ఒక కాలును వంచి పాదాన్ని ఎదురుగా ఉన్న తొడ బయట ఉంచాలి. వెన్నెముకను నిటారుగా ఉంచి మొండెంను వంగిన మోకాలి వైపుకు తిప్పాలి. ఈ ఆసనం జీర్ణ గ్రంథులను ఉత్తేజితం చేసి శరీరం నుండి విష పదార్థాలను తొలగించడంలో సహాయపడుతుంది. అదే విధంగా పశ్చిమోత్తానాసనం కూడా జీర్ణక్రియకు ఎంతో మేలు చేస్తుంది. ఈ ఆసనం పొత్తికడుపుపై ఒత్తిడిని కలిగించి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఈ ఆసనం వేయడానికి ముందుగా కాళ్లు చాపి కూర్చోవాలి. తరువాత నడుము భాగం నుండి ముందుకు వంగి పాదాలను తాకడానికి ప్రయత్నించాలి. ఇలా చేయడం వల్ల మలబద్ధకం సమస్య తగ్గుతుంది.

### మలాసనం, ధనురాసనం..


ఇక మలాసనం అనేది లోతైన స్క్వాట్ ఆసనం, బౌల్ మూవ్‌మెంట్‌ను సహజంగా మెరుగుపరుస్తుంది. ఈ ఆసనం వేయడానికి ముందుగా కాళ్లు వెడల్పుగా ఉంచి స్క్వాట్‌లో కూర్చోవాలి. తరువాత చేతులను నమస్కారం ముద్రలో ఉంచాలి. తరువాత మోకాళ్లపై మోచేతులను ఉంచి నొక్కాలి. ఇది పెల్విక్ ప్రాంతంలో రక్తప్రసరణను మెరుగుపరుస్తుంది. ఆరోగ్యకరమైన ప్రేగు పనితీరుకు తోడ్పడుతుంది. అదే విధంగా ధనురాసనం కూడా జీర్ణ అవయవాలను శక్తివంతంగా ఉత్తేజితం చేస్తుంది. ఈ ఆసనం వేయడానికి పొట్టపై పడుకోవాలి. మోకాళ్లు వంచి కాళ్లను చేతులతో పట్టుకోవాలి. అదే సమయంలో ఛాతీ, తొడలను పైకి లేపి ఉంచాలి. ఇది జీర్ణ గ్రంథులను ఉత్తేజితం చేసి గట్ యాక్టివిటీ పెంచుతుంది. ఈ విధంగా యోగాసనాలు జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహజమైన, ప్రభావవంతమైన మార్గంగా పని చేస్తాయి. అయినప్పటికి ఈ ఆసనాలు వేస్తూనే సరైన ఆహారం తీసుకోవాలి. రోజూ తగినంత నీరు తాగాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఖాళీ కడుపుతో, సరైన మార్గదర్శకత్వంలో యోగా చేయడం మంచిదని, నిరంతరం యోగాసనాలు వేయడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## డయాబెటిస్‌తో మతిమరుపు...

డయాబెటిస్ అనేది పెనుభూతంగా మారిన సంగతి తెలిసిందే. భారతదేశంలోనూ షుగర్ వ్యాధిగ్రస్థుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. కడుపు నిండా ఏది తిందామన్నా రక్తంలో షుగర్ లెవల్స్ ఎక్కడ పెరిగిపోతాయోననే భయం వారిని వెంటాడుతూనే ఉంది. అందుకే భోజనం విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటుంటారు. లెక్కలేసుకుని మరీ ఎంత తినాలో అంతే తింటుంటారు. అలాగే షుగర్‌తో వచ్చే ఇతర ఆరోగ్య ప్రమాదాల గురించీ ఎంతో అప్రమత్తంగా ఉంటుంటారు. అలాంటి డయాబెటిస్ రోగులకు మరో షాకింగ్ న్యూస్. వారికి మతిమరుపు వచ్చే ప్రమాదం పొంచి ఉందని తాజా అధ్యయనం చెబుతోంది. బోస్టన్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రముఖ డాక్టర్ జెన్నిఫర్ వీవ్ నేతృత్వంలో చేసిన తాజా అధ్యయనంలో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి.

డయాబెటిస్ రోగులకు డిమెన్షియా(మతిమరుపు) వచ్చే ప్రమాదం ఉందని ఆ అధ్యయనంలో తేలింది. సాధారణ వ్యక్తుల కంటే వీరికి ఈ వ్యాధి వచ్చే ప్రమాదం మూడు రెట్లు అధికంగా పొంచి ఉందని జెన్నిఫర్ తెలిపారు. సుమారు 2.83లక్షల మందిపై సుదీర్ఘ అధ్యయనం చేసి ఈ విషయాన్ని కనుగొన్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలను అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీకి చెందిన న్యూరాలజీ పత్రికలో ప్రచురితమయ్యాయి. టైప్-1 డయాబెటిస్ ఉన్నవారికి భవిష్యత్తులో మతిమరుపు వ్యాధి వచ్చే అవకాశం 3 రెట్లు అధికంగా ఉందని.. టైప్-2 డయాబెటిస్ వచ్చే వారికి ఈ ముప్పు 2 రెట్లు అధికంగా ఉందని అధ్యయనం చెబుతోంది. సాధారణ వ్యక్తులకు అంటే డయాబెటిస్ లేని వారిలో కేవలం 0.6 శాతం మందికి మాత్రమే డిమెన్షియా రాగా.. టైప్-1 బాధితుల్లో 2.6శాతం మందికి వచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి. టైప్-1 డయాబెటిస్ మొత్తం డయాబెటిస్ కేసుల్లో 5 శాతమే అయినా.. మెదడుపై చాలా ప్రభావం చూపిస్తుందని జెన్నిఫర్ చెబుతున్నారు. ఇలాంటి వారిలో 65 శాతం డిమెన్షియా కేసులను నేరుగా షుగర్ వ్యాధికే ఆపాదించవచ్చని ఆమె వివరించారు. ఈ అధ్యయనం డయాబెటిస్, డిమెన్షియా మధ్య సంబంధాన్ని మాత్రమే చూపించిందని.. దీన్ని ఇంకా శాస్త్రీయంగా నిరూపించలేదని చెప్పుకొచ్చారు. ఈ ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు షుగర్ వ్యాధి రాకుండా చూసుకోవడమే మార్గమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. హెల్తీ డైట్‌తో షుగర్ వ్యాధి బారిన పడకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు.

## ఈ ఆకులతో మధుమేహం, ఊబకాయం రెండింటికీ చెక్.. ఎలాగో తెలుసా..!



ప్రస్తుత జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా అనేక అనారోగ్యాలు ప్రబలుతున్నాయి. మధుమేహం, ఊబకాయం లాంటి సమస్యలతో అనేక మంది బాధపడుతున్నారు. ఆ అనారోగ్య సమస్యల నుంచి బయటపడేందుకు చాలామంది అనేక ప్రయత్నాలు చేసి కూడా విఫలమవుతున్నారు. అయితే ఈ మధుమేహం, ఊబకాయం సమస్యలకు చెక్ పెట్టేందుకు జామ ఆకులు అద్భుత ఔషధంగా పనిచేస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ ఆకులను క్రమం తప్పకుండా తీసుకోవడంవల్ల ఈ రెండు సమస్యలకే కాకుండా అనేక ఇతర అనారోగ్య సమస్యలకు కూడా పరిష్కారం ఉంటుందని అంటున్నారు. జామాకు ప్రయోజనాలను ఇప్పుడు తెలుసుకుందాం..

### ప్రయోజనాలు..

జామ ఆకుల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. జామ ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి కడుపు పూతల నుంచి శరీరాన్ని రక్షించడంలో సహాయపడుతాయి. దగ్గు, దురద మొదలైన వాటితో బాధపడుతున్నవారు జామ ఆకులను తినాలి. ఎందుకంటే వీటిలో శరీరానికి ఉపశమనాన్ని అందించే యాంటీ అలర్జీ లక్షణాలు ఉంటాయి. అంతేకాదు జామ ఆకులను వివిధ రూపాల్లో తీసుకుంటే ఆరోగ్యం మెరుగుపడుతుంది. జామ ఆకులను క్రమం తప్పకుండా తీసుకుంటూ ఉంటే మగవారికి మేలు చేస్తుంది. సంతానలేమి సమస్యను దూరం చేస్తుంది. జామ ఆకుల సారాన్ని తీసుకుంటే స్పెర్మ్ నాణ్యత, కౌంట్ పెరుగుతుంది. జామ ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ నుంచి ఉపశమనం అందిస్తాయి. జామ ఆకులను రెగ్యులర్‌గా తింటే ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. జామపండుతో ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో జామ ఆకులతో కూడా అంతకుమించి ప్రయోజనాలు పొందవచ్చునని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. జామాకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ మైక్రోబయిల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. జామ ఆకులు క్యాలరీ ఫ్రీ. ఇవి బరువు తగ్గడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. జామ ఆకులను పచ్చిగా తిన్నా కూడా రుచిగా ఉంటాయి. కావాలనుకుంటే జ్యూస్‌లా చేసుకుని తాగవచ్చు. జామ ఆకులను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చర్మం ముడతలు మాయమవుతాయి. మొటిమలు, నల్ల మచ్చలను తొలగించడంతో జామ ఆకులు సహాయపడతాయి. జామ ఆకులు హైపర్ పిగ్మెంటేషన్‌ను తగ్గిస్తాయి. జామ ఆకుల పేస్ట్‌ను అప్లై చేసుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చు. జుట్టును ఒత్తుగా మార్చడంలో జామ ఆకుల సారం సహాయపడుతుంది. ఈ రసం తీసుకుంటే జుట్టు మూలాల నుంచి దృఢంగా మారుతుంది. జామ ఆకుల పేస్ట్‌ను తలకు రాసుకుంటే జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. జామ ఆకులలో కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి శరీరానికి సహాయపడే అనేక అంశాలు ఉన్నాయి. జామ ఆకుల టీ తాగితే రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గి, మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. అంతే కాదు శరీరంలో రక్త ప్రసరణను మెరుగుపరిచి గుండె జబ్బుల సమస్యలను దూరం చేస్తుంది. పిండి పదార్థాలు చక్కెరలుగా మారడాన్ని జామ ఆకుల సారం నియంత్రిస్తుంది. దాంతో మధుమేహం అదుపులో ఉంటుంది. ఊబకాయంతో బాధపడేవారు జామ ఆకుల టీ తీసుకోవాలి. జామ ఆకులతో తయారు చేసిన టీ తాగడంతో జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా మారుతుంది. జామ ఆకుల టీతో జీర్ణ వ్యవస్థలో ఉన్న చెడు బ్యాక్టీరియా తొలగుతుంది. ఇందులోని డైటరీ ఫైబరీ జీర్ణ సమస్యలను దూరం చేస్తుంది. జామ ఆకులను తీసుకోవడంతో డెంగ్యూ నుంచి వేగంగా కోలుకోవచ్చు. జామ ఆకులను తీసుకుంటే రక్తంలో ప్లేట్‌లెట్స్ సంఖ్య వేగంగా పెరుగుతుంది. జ్వరం తీవ్రత సైతం తగ్గుతుంది.

## ఈ సీజన్‌లో చాలా మందికి వచ్చే గొంతు పొడిబారే సమస్య.. ఎందుకు వస్తుంది..



శీతాకాలం ముగిసి ఉష్ణోగ్రతలు పెరగడం ప్రారంభమైనప్పుడు, చాలా మందిలో ఒక సాధారణ సమస్య కనిపిస్తుంది. చాలా మందికి ఉదయం లేవగానే గొంతు ఎండి పోయినట్టు, గరుకుగా లేదా గొంతు బిగుసుకున్నట్టు అనిపిస్తుంది. వసంత కాలం పూలతో అందంగా ఉన్నప్పటికీ, అదే సమయంలో గాలిలో పుప్పొడి స్థాయిలు పెరుగుతాయి, వాతావరణ మార్పులు వేగంగా జరుగుతాయి. ఈ మార్పులు శ్వాసకోశ మార్గానికి చికాకును కలిగించి గొంతు అసౌకర్యానికి కారణమవుతాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అలర్జీ సంబంధిత శ్వాస సమస్యలతో బాధపడుతున్నారు. భారతదేశంలో వసంత కాలంలో చెట్లు, గడ్డి నుంచి వచ్చే పొలెన్, ధూళి, కాలుష్యం, తేమ మార్పులన్నీ కూడా గొంతు, శ్వాసనాళాలపై ప్రభావం చూపుతాయి.

### కారణాలు ఇవే..

అలాగే వసంతకాలంలో గొంతు ఎండిపోయినట్టు, పొడిగా అనిపించడానికి అనేక కారణాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. వసంత కాలంలో మొక్కలు పెద్ద మొత్తంలో పుప్పొడిని విడుదల చేస్తాయి. ఈ చిన్న కణాలు శ్వాసలోకి వెళ్లినప్పుడు శరీరం హిస్టమిన్స్ ను విడుదల చేస్తుంది. దీంతో ముక్కు, గొంతులో వాపు వస్తుంది. దీని వల్ల గొంతు ఎండిపోవడం, దురద, దగ్గు, గొంతు గరుకుగా మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. గొంతులో చికాకుకు మరో సాధారణ కారణం పోస్ట్-నాసల్ డ్రిప్. ఈ పరిస్థితిలో మ్యూకస్ గొంతు వెనుక భాగంలో చేరుతుంది. ఇది నిరంతరం గొంతులోకి జారుతుంది. దీంతో నిరంతరం చికాకు, దగ్గు, గొంతు సవరించడం, గొంతు గరగర వంటి లక్షణాలు ప్రేరేపించబడతాయి. అలాగే వసంత కాలంలో ఉష్ణోగ్రతలు మారుతుంటాయి. పొడి గాలులు, ధూళి పెరుగుతాయి. కాలుష్యం ఎక్కువ అవుతుంది. ఇవి గొంతు ఎండిపోవడానికి కారణమవుతాయి. వీటితో పాటు ఇండోర్ వాతావరణాలు కూడా ఈ సమస్యకు దోహదం చేస్తాయి. ాజ గదుల్లో తేమ తగ్గిపోవడం వల్ల గొంతు, ముక్కు ఎండిపోతాయి. ఇంట్లోని పొడి గాలి శ్వాసకోశ మార్గానికి చికాకును కలిగించి అలెర్జీలు ఉన్న వారిలో లక్షణాలు మరింత తీవ్రతరం అవుతాయి.


# ఉదయం కవితోదయం

# సాహితీ కవనం



## అమరవీరుల స్ఫూర్తి పొందాలి..!

9581419999
ఉదయం
WWW.METROUDYAM.COM




మిము చూసి నేర్చుకోవాలి
పిరికి మదిలో ధైర్యం
బానిస సంకెళ్ళ నిర్మూలనం
అహంకారానికి ఎదురు తిరగటం
బందించాలని చూస్తే పోరు సాగించటం.
సూర్యుడు ఉన్నంతకాలం
సమాజంలో మంచి ఉన్నంతకాలం
మార్పు కోరే ప్రతి సమయం
పోరు సాగించే ప్రతి క్షణం
గుర్తుంటుంది మీ త్యాగం
అజేయమైన మీ గొప్పతనం.

భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురు
విప్లవ జ్యోతులు
భవిష్యత్తు ఆశా కిరణాలు
అభ్యుదయ మూర్తులు
యువతకు మార్గదర్శకులు.
తప్పును ఖండిస్తూ
అన్యాయాన్ని ఎదిరిస్తూ
హక్కులకై పోరాడుతూ
న్యాయాన్ని కోరుతూ
స్ఫూర్తి గా నిలిచారు
సులువుగా ప్రాణాలు అర్పించారు.
ఓ వీరులారా




**డా.యణమనగండ్ల రాజేందర్**
**వికాస వేదిక కార్యదర్శి ఇల్లందు,**
**భద్రాద్రి కొత్తగూడెం.**

## మనస్సు కకావికలమైతే,,,,

9581419999
ఉదయం
WWW.METROUDYAM.COM



మనస్సు వేదనా సంద్రమై
తన ఆధీనంలో లేని మనస్సు
ఈ కాళరాత్రి కారుమేఘాలు
కమ్ముకుని
జీవితం లోలోతుల దాకా
తొవ్వుకుంటున్న మనస్సు
గూడు,,,,
భ్రమలలో బ్రతుకు దైనందినం
భరించలేని రంపపుకోతలో
మనస్సు
అదుపు దప్పిన ఆలోచనలు
ఖడ్గంతో ఖండించినట్లు పోట్లతో
మనస్సు
శరీరమంతా తేలికయైన భావన
కాళ్ళు చేతులు మినహా వేరే అంగాలు లేనట్లు
నిరంతరం తలను తడుముతూ చేతులు
శరీరంలో చేవలేక చేష్టలుడిగి
జీవితంలో ఆఖరి పోరాటంలా
నిద్రలేని రాత్రుళ్ళు అదేపనిగా ఆలోచనల సంగ్రామం
మనోవ్యాకులత తీవ్రమైన గందరగోళం
గుణపంతో మనస్సును పొడుస్తున్నా దుఃఖం రాక,,,,
ఊహలకందని కకావికలమైన మనస్సు
దగ్గరివాళ్లకు నరకయాతన వీళ్ళను భరించడం
వెంటనే మానసిక వైద్యశాలలో చేర్పించాలి
సైక్రియాట్రిస్టుల పర్యవేక్షణలో మందుల వాడకంతో
పేషంట్ తనపరిస్థితి తనకు అర్థమై
హృదయ విదాకారంగా వెక్కివెక్కి
ఏడుస్తూ
జనజీవన శ్రవంతిలో తానూ
ఒకడులా జీవితం
కొనసాగిస్తాడు,,,,!!



**అపరాజిత్ సూర్యాపేట**

## కాలు తున్న కొలిమిని కౌగిలించే వేళ :

### (యుద్ధం )

వేసంగీ వయ్యారాలుగ్రీష్మని పరితాపాలు
ఉదయభానుడి భగభగలు
మదిలో విరబూసిన శిలాజాలు
కష్టజీవికి కలిమిలేని కన్నీటి సుదులు
కాలునికి సైతం కనికరం లేని నిజాలు
బూడిదవుతున్నఆకాశసౌధాలు
అలసిసొలసినసామాన్య బ్రతుకులు

దేశాల మధ్యశాంతి మబ్బులజాడలేదు
జనుల కంటిమీదకునుకులేదు
వలస జీవుల శ్రమకు ఫలితం లేదు
గర్వాంధుల ఆశకు అంతు లేదు
వలస జీవుల ఆకలి రోదనలు వినలేదు

ఆకలి చావులు అరణ్య రోదనలైనవి
అగ్రరాజ్యల ఆదిపత్యంకై అహరహరము
దేశాలు అగ్ని గుండమై కాలుతున్నవేళ
సకల దేశాలు సమస్యలవలలో చిక్కిన వేళ
వలస జీవులే శలభాలై మాడుతున్న వేళ
దినసరికూలీలు కూడు లేక కూనరిల్లు వేళ

పొట్ట కూటి కోసం వెళ్లిన జీవుల ఆశలు
పేక మేడలై కూలుతున్నవిఎడారి బతుకులు
పదవీ ముసుగులో అహంకారుడు చేసిన తప్పిదాలు
జీవులమనుగడ మరణశయ్యపై మూలుగుతున్నది
గాడి తప్పిన జగతిజనులు కష్టాల కడలిలో నున్నారు

గమ్యము చేరు మార్గము కానరాని క్షణము
నేడు పుడమితల్లి రగులుతున్న ఓ అగ్నిపర్వతం
ఆరని యుద్ధ జ్వాలల తో జగతిన
కాలుతున్న కొలిమిని కౌగిలించినవారిబతుకు
నరక లోక యాతనే కదా మరి.



**డాక్టర్ కవికోకిల కొతారివెంకటరత్నం కవి,**
**రచయిత, వి. కోట చిత్తూరు**
**జిల్లా.9000169823.**

## శాంతి సమరంకై

9581419999
ఉదయం
WWW.METROUDYAM.COM

గర్జించాల్సిన కలాలు
గతితప్పి మూగబోయి రోదిస్తున్నయా
సమైక్యతాభావం వెదజల్లి
చైతన్యం రగిలించి
సమరంకై పోరాడమని చెప్పే కలాలు
కన్నీరు కారుస్తున్నాయా
ఏ కవితా గానం చేస్తే
ఏమౌతుందో అని
మతం ముసుగు వేసి
మాన ప్రాణాలను తీస్తున్నారని
ప్రశ్నించకుండా
కలవర పడుతున్నాయా కలాలు
ఆధిపత్యం కోసం
ఒక దేశం పై మరొక్క దేశం
యుద్ధం చేస్తుంటే
ఆపలేక పోయామని
కవితా స్వరాలు ఐక్యతా రాగాలు
నిశబ్ద గానం వినిపిస్తున్నవి
ప్రపంచ శాంతిని కాంక్షిస్తున్నవి
పెత్తందారి భావజాలాన్ని
అంతం చేయడానికి
శాంతి కపోతాలను ఏకం చేస్తు
సమైక్యతా రాగం వినిపించడానికి
అక్షర సేద్యం చేస్తున్నవి
కుంపటిలో దాగిన అగ్నిలా
రగులుతూ
జాతి మత వివక్ష చూపే దుర్మార్గులను
అగ్నితో ఆవరించి
ప్రపంచ శాంతిని నెలకొల్పాలని
అక్షర సమరం చేయడానికి
కవాతు చేస్తున్నాయో...
నిశ్శబ్ధ కలాలు స్వరాలు



**కవి రచయిత**

**గుర్రం జాషువా సాహిత్య పురస్కార**
**గ్రహీత నక్క కుమారస్వామి,**
**వంగపహాడ్ -హన్మకొండ**

## ఆశ...

9581419999
ఉదయం
WWW.METROUDYAM.COM

మనసు లో మొలిచే చిన్న దీపం...
ఆలోచన...
ఆ దీపానికి దారి చూపే వెలుగు...
అన్వేషణ...
అజ్ఞాతాన్ని అడుగడుగునా
ప్రశ్నించే ధైర్యం...
ఆవిష్కరణ...
అన్వేషణకు లభించిన అమూల్య సమాధానం...
మనిషి ప్రయాణం ఇదే...
ఆశతో మొదలై, ఆలోచనతో ఎదిగి,
అన్వేషణతో తడబడినా..!?
ఆవిష్కరణలో...
తనకు తాను కనుగొంటాడు...
జీవితం అనేది సిద్ధంగా దొరికేది
కాదు...
ప్రతి స్వప్నన్ని సాధించాలంటే..!?
మనసు ప్రశ్నంచాలి, మెదడు
శ్రమించాలి, హృదయం నమ్మాలి..



**చరణం :యస్. రాహుల్**
**చరవాణి :9912217220 రత్నతండా (వీరబోయిన పల్లి )**
**నల్లగొండ**

## ఉగాది దివ్య చరణం

9581419999
ఉదయం
WWW.METROUDYAM.COM

జయతు జయతు మంగళం
జయతు జయతు మంగళం,

ఓం కారం దివ్య చరణం. మహాకాలం ఈ మందిరం

మహోన్నతం మంగళకరం
ఈ అంతరాత్మ ఓ ప్రాకారం

దీర్ఘ కాల గమనం ఈ జీవనం.
ఓ సార్థకతకు ఆధారం

అనిర్వచనీయం ఆరాధ్య దైవం
ఈ మనుషులపై కనికరం

చల్లని నిఘాడ నిజ స్వరూపం
నీ దర్శనం మాకు వరం

నీ సన్నిదే ఈ చిరు ప్రాణులకు
ప్రాణ బిక్ష నీ సాకారం

జయతు జయతు మంగళం
జయతు జయతు మంగళం

కరుణా కటాక్ష కరుణించి కాపాడే చల్లని వాడ

నీ దీవెనలే ఈ బుడిదతో సమానమైన ఈ జీవికి అందరి వాడ

అందనంత ఎత్తులో ఉన్నావు నా స్వామి గోవిందుడ

అనంత లోకాలకు అధిపతి చల్లనైన నల్లని వాడ

వర్ణణాతీతం ఆ వజ్రాల వెంకటేశ్వరుని కొలమానం

పవిత్రస్థలం ఆ శేషశయనుడు ఈలోకానికి బహుమానం

సాంప్రదాయం మన పరిపూర్ణ పండుగలు ఈ శోభాయమానం

పచ్చని పరవళ్ళు ప్రకృతి అందించిన వరాలు మనకు ప్రమానం

సిరులు విరులు కోలా హలాలు కొంగు బంగారం

మరులు తామరలు వింద్యా వనాలు అనంత గోపురం

షడ్రుచుల సంగమం ఈ కలయికకు ఆనందం

అందరి అభిమాన బంధు సమూహం నవ్య కాంతుల వినోదం

చూడ ముచ్చట గొలిపే సంబరం ఈ ఉగాదికి వందనం

చైత్ర మాసన వచ్చే మొదటి ఉత్సవం మనందరికి చేతనం

జయతు జయతు మంగళం
జయతు జయతు మంగళం



## ఆడజన్మ అపురూపం

అమ్మ నవుగన్నా మా యమ్మ...
ఎందుకీ పని చేసావు
చెత్తకుప్పలో నను వేయ నీకు మనసేలా వచ్చే నమ్మ..
మరుజన్మమెత్తి నాకు
జన్మనిచ్చావు...
నే కడుపులో పడ్డ క్షణం
నుంచి ఎన్నో కలలు
కని నన్ను కన్నావు...

మరి, ఇంత సాహసం
ఏలా చెయ్యగలిగావు.
నేపుట్టిన మరుక్షణం
నా,ఏడుపును వింటే అసహ్యం వేసిందా.. ఒక్కసారి నన్ను చూస్తే
నీ మనసు పొంగిపోలేదా
నాకు మగపిల్ల పుట్టిండ ని హృదయం పొంగి పోలేదా..

నను కన్న క్షణాల కష్టం కన్న, రేపు నన్ను పెంచబోయే రోజులు కష్టమేమి కాదని తోచలేదా, మాతృమూర్తి మమకారం నీలో చచ్చిపోయిందా...

లోకానికి, జడిసి నన్ను
పెట్టకుప్పలా పాలజేస్తే
కుక్కలు నన్ను పీక్కు తింటుంటే, నీ మనసు
అంతా కఠినమైనదా...
నీ హృదయం చలించ నిదా...

అమ్మ, యనే పిలుపు కోసమే కదా ఈ ఆడ జన్మ పవిత్రమైనది లోకాన్ని సృష్టించే స్త్రీ మూర్తి యని ఈ భూమండలానికే ఆరాధ్య దైవమైనది.

ఎన్నో, చదువులు చదివితే ఏం లాభం, భవిష్యత్తు
ఊహించిన దానివి అప్పుడే భ్రూణహత్యకు
పాల్పడక పోయావా.
మానవ జన్మ, కర్మ
సిద్ధాంతాన్ని పాటించక
తప్పదని తెలిసే కదా
ఇదేం విడ్డూరం కని చెత్త కుప్పలో వెయ్యడం...


ఈ లోకానా పిల్లలు లేని
తల్లులెందరో తల్లడిల్లి పోతున్నారు..
వారేవ్వరు
హర్షించారు నీ గుండె
ధైర్యాన్ని...

మానవ జన్మ అంటేనే
కష్టసంఖాలనం,
ఎదుర్కొని నిలబడే
అపురూపమైన స్త్రీ
మనుష్య రూపం...
అతి అమూల్య
మయినది...

9581419999
ఉదయం
WWW.METROUDYAM.COM

నీకు మరో జన్మంటూ ఉంటే ఆడజన్మ నెత్తకు
నాలా దొరికిన మానవ
జన్మను అంతం చెయ్యకు...

అమ్మ నవుగన్నా మా
యమ్మ, బంగారు తల్లి సృష్టికే ఆధారభూత మైన ఓ స్త్రీ,
కొద్ది క్షణాలైనా నీ కొడుకుగా
అవకాశమిచ్చినందుకు
నీకు పాదాభివందనం...



**గుండు కోటేశ్వర్ రావు**
**కాశీబుగ్గ వరంగల్,**
**9849992431**

# చిత్రోదయం

## మోటోక్రాస్ రేసింగ్‌తో దూసుకొస్తున్న 'బైకర్'..

**ట్రైలర్‌తో అంచనాలు పెంచిన శర్వానంద్!**




టాలీవుడ్ హీరో శర్వానంద్ నటిస్తున్న తాజా చిత్రం 'బైకర్' ట్రైలర్ విడుదలై సోషల్ మీడియాలో భారీ హల్‌చల్ సృష్టిస్తోంది. మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంలో రూపొందిన ఈ స్పోర్ట్స్ డ్రామా ఇండియన్ సినిమాల్లో అరుదుగా చూసే జానర్ కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ సినిమాలో శర్వానంద్ 'విక్కీ' అనే రేసర్ పాత్రలో స్టైలిష్ మేకోవర్‌తో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. దర్శకుడు అభిలాష్ రెడ్డి తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. ట్రైలర్ చూస్తుంటే విజువల్స్, రేసింగ్ సన్నివేశాలు హాలీవుడ్ స్థాయిలో ఉండటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బైక్ రేసింగ్ అంటే ప్రాణం పెట్టే ఒక యువకుడు తన లక్ష్యం కోసం చేసే పోరాటాన్ని దర్శకుడు ఎమోషనల్‌గా చూపించబోతున్నట్లు అర్థమవుతోంది.

ఈ సినిమాలో మరో ప్రధాన ఆకర్షణ రాజశేఖర్ పోషించిన తండ్రి పాత్ర. శర్వానంద్-రాజశేఖర్ మధ్య వచ్చే సన్నివేశాలు ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచాయి. తండ్రీకొడుకుల మధ్య ఉన్న భావోద్వేగాలకంటే, వారి మధ్య జరిగే ఇగో క్లాష్ కథకు కీలకంగా కనిపిస్తోంది. "నువ్వు అందరికంటే ముందు రాలేదు.. అందరూ నీకంటే వెనుక వచ్చారు" వంటి డైలాగ్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. టెక్నికల్ పరంగా కూడా సినిమా బలంగా కనిపిస్తోంది. సంగీత దర్శకుడు గిబ్రాన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు మరింత ఎలివేషన్ ఇచ్చింది. "బైకర్ అంటే స్పీడ్ కాదు.. రెస్పెక్ట్" అనే డైలాగ్ సినిమా థీమ్‌ను స్పష్టంగా తెలియజేస్తోంది. రేసింగ్ కేవలం వేగం మాత్రమే కాకుండా క్రమశిక్షణ, గౌరవం కూడా అవసరమని ఈ చిత్రం చెప్పబోతుందని అర్థమవుతోంది.ఇక హీరోయిన్‌గా మాళవిక నాయర్ నటిస్తుండగా, బ్రహ్మాజీ, అతుల్ కుల్కర్ణి వంటి ప్రముఖులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. శర్వానంద్ ఈ పాత్ర కోసం ఫిజికల్‌గా చేసిన కష్టం కూడా ట్రైలర్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. ఏప్రిల్ 3న విడుదల కానున్న ఈ సినిమా ట్రైలర్ ఇచ్చిన ఇంపాక్ట్ చూస్తుంటే, శర్వానంద్ కెరీర్‌లో ఇది ఒక మైలురాయిగా నిలిచే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. యాక్షన్‌తో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్ మిళితమైన ఈ 'బైకర్' అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉందనే నమ్మకంతో చిత్ర యూనిట్ ముందుకు సాగుతోంది.

## పవన్ కళ్యాణ్ కొత్త సినిమా ఎలా ఉంది.!




పవన్‌కల్యాణ్ సినిమా అంటే అంచనాలు సర్వసాధారణం. అందునా 'ఓజీ' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వస్తున్న సినిమా.. పైగా 'గబ్బర్‌సింగ్' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత హరీశ్‌శంకర్ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ నటించిన సినిమా కావడంతో అనౌన్స్‌మెంట్ నుంచి ఆడియన్స్‌లో సినిమాపై క్యూరియాసిటీ హెచ్చుగానే ఉంది. మైత్రీ మూవీమేకర్స్ నిర్మాణ విలువలు, ప్రమోషన్‌లో భాగంగా విడుదల చేసిన ప్రచారచిత్రాలు అన్నీ సినిమాపై అంచనాలు మరింత పెంచాయి. ఇన్ని ఎక్స్‌పెక్టేషన్స్ మధ్య ఈ గురువారం ఎట్టకేలకు 'ఉస్తాద్ భగత్‌సింగ్' విడుదలైంది. మరి అందరి అంచనాలనూ ఉస్తాద్ అందుకున్నాడా? అనే ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలంటే ముందు కథలోకి వెళ్లాలి.పవన్ కళ్యాణ్ సినిమాలు

### కథ

చదలమర్రి నల్లనాగప్ప(పార్థీబన్) పరమ దుర్మార్గుడు. ఎలాగైనా ముఖ్యమంత్రి కావాలనేది అతని లక్ష్యం. దానికోసం ఎంతకైనా తెగిస్తాడు. ఇందులో భాగంగా తనకు అడ్డున్న రాష్ట్ర ముఖ్యమంత్రిపై హత్యాప్రయత్నం చేస్తాడు. తీవ్రగాయాల పాలై, కొన ఊపిరితో ఉన్న ముఖ్యమంత్రి, హాస్పిటల్ ఇంటెన్సీవ్ కేర్‌లో ప్రాణాపాయ స్థితిలో ఉంటాడు. దాంతో అదే పార్టీలోని మరో సీనియర్ నేతని అపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటారు. అతన్ని కూడా నల్లనాగప్ప హత్య చేయిస్తాడు. దాంతో పార్టీలో మూడో స్థానంలో ఉన్న నల్లనాగప్ప ముఖ్యమంత్రి అవుతాడు. అతని కొడుకు (కిల్లి క్రాంతి) తండ్రిలాగే రాక్షసుడు. ఎంజాయ్‌మెంట్ కోసం తలకోన ఫారెస్ట్‌కి వెళ్తాడు. అక్కడి పోలీసులు వందల టన్నుల గంజాయిని సీజ్ చేశారని తెలిసి, గంజాయి కావాలంటూ.. అక్కడి పోలీస్ స్టేషన్‌పై దాడి చేస్తాడు. పోలీసుల్ని, వాళ్ల కుటుంబీకుల్నీ చిత్రహింసలు పెడుతుంటాడు. అప్పుడొస్తాడు ఉస్తాద్ భగత్‌సింగ్ (పవన్‌కల్యాణ్). ముఖ్యమంత్రి కొడుకుని, అతని మనుషుల్ని ఓ రేంజ్‌లో ఆడుకుంటాడు. కొంతమందినైతే నిర్ధాక్షిణ్యంగా చంపేస్తాడు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి కొడుకుని కిడ్నాప్ చేస్తాడు. తన కొడుకు ఆచూకీ తెలియకపోవడంతో.. పాతబస్తీలో ఉండే ఉగ్రవాదుల్ని ఆశ్రయిస్తాడు ముఖ్యమంత్రి. ఉగ్రవాదులు.. ముఖ్యమంత్రి కొడుకుని వెతుక్కుంటూ అడవిలోకి వస్తారు. వచ్చినవాళ్లను వచ్చినట్టే అందర్నీ చంపేస్తాడు ఉస్తాద్ భగత్‌సింగ్. ఇంతకీ ఎవరీ ఉస్తాద్ భగత్‌సింగ్? ముఖ్యమంత్రి కొడుకుని ఎందుకు కిడ్నాప్ చేశాడు? ముఖ్యమంత్రికీ ఉగ్రవాదులకూ సంబంధం ఏంటి? ఈ ప్రశ్నలకు సమాధానమే అసలు కథ.కొత్త సినిమాలు

### విశ్లేషణ

నిజానికి పరమ రొటీన్ కథ ఇది. అయితే.. ఇలాంటి మాస్ సబ్జెక్ట్‌ని సదరు హీరో అభిమానులకు నచ్చేలా, ఎక్కడా విసుగులేకుండా తీయగలిగితే సినిమా హిట్టే. దర్శకుడు హరీశ్‌శంకర్ ఆ విషయంలో విజయం సాధించాడనే చెప్పాలి. పవన్‌కల్యాణ్ అభిమానులు పండుగ చేసుకునేలా సినిమాను తీర్చిదిద్దాడు హరీశ్ శంకర్. ముఖ్యంగా పవన్ కోసం రాసుకున్న కొన్ని డైలాగులు అభిమానులకే కాదు, సగటు ప్రేక్షకుడికి కూడా గూజ్‌బంప్స్ తెప్పిస్తాయి. పవన్‌కల్యాణ్ పాత్రకు ఇచ్చిన ఎలివేషన్స్ కానీ, ఆ పాత్ర ప్రవర్తన కానీ, ఆ పాత్ర వాడే భాష.. ఇవన్నీ జనాలకు నచ్చేస్తాయి. ప్రథమార్ధం అంతా ప్రశ్నలతోనే ముగించాడు హరీశ్‌శంకర్. ద్వితీయార్ధం మొదలైనప్పట్నుంచీ ఒక్కో చిక్కుముడిని విప్పుకుంటూ, సమాధానాలిచ్చుకుంటూ ఆసక్తికరంగా కథను నడిపాడు. అందుకే.. ప్రథమార్ధం కాస్త సోసోగా అనిపించినా.. ద్వితాయార్ధం మాత్రం స్పీడ్‌గా జనరంజకంగా అనిపిస్తుంది. ముఖ్యంగా ద్వితీయార్ధంలో శ్రీలీల ఎపిసోడ్‌ని ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తారు. ఈ ఎపిసోడ్‌లో అంతా వింటేజ్ పవన్‌ని చూస్తారు. పవన్ పాత సినిమాను గుర్తు చేస్తూ అభిమానులకు నచ్చేలా సినిమాను తీశాడు హరీశ్ శంకర్. 'తొలిప్రేమ'లోని 'నీ మనసే..' పాటను ఈ సినిమాకోసం మళ్లీ వాడేశాడు. ఈ పాట పిక్చరైజేషన్ కూడా బావుంది. అయితే.. అక్కడక్కడ కామెడీ కోసం పెట్టిన కొన్ని సన్నివేశాలు పంటికింద రాళలాగా ఇబ్బంది పెడతాయి. మొత్తంగా 'ఉస్తాద్ భగత్‌సింగ్ ' పైసా వసూల్ సినిమా అని చెప్పొచ్చు.


### నటీనటులు

పవన్‌కల్యాణ్ గురించి చెప్పేదేముంది? ఇలాంటి పాత్రలు చేయడంలో అతను మాస్టర్ అని 'గబ్బర్‌సింగ్'తోనే రుజువు అయింది. ఈ సినిమాలోనూ అదే జోష్‌తో అలరించారు పవన్‌కల్యాణ్. ఓ విధంగా సినిమా వన్‌మ్యాన్ షో. ఒంటిచేత్తో సినిమాను మోశారు పవన్‌కల్యాణ్. హీరోయిన్లలో శ్రీలీల పాత్ర కథలో చాలా కీలకం. అనుకున్నట్టే తను చాలా బాగా చేసింది. ఇక పార్తీబన్, రావురమేష్, కె.ఎస్.రవికుమార్ అంతా పరిధిమేర పాత్రలన రక్తికట్టించారు.

### సాంకేతికంగా

కథ పాతదే. దాన్ని హరీష్ కొత్తగా నడిపించిన విధానం బావుంది. ముఖ్యంగా హరీశ్‌శంకర్ డైలాగులు ఈ సినిమాకు హైలైట్. అద్భుతమైన అర్థవంతమైన సంభాషణలతో అందర్నీ ఆకట్టుకున్నారాయన. ఇక తమన్ నేపథ్య సంగీతం, దేవిశ్రీ పాటలు సినిమాకు బలాన్నిచ్చాయి. కెమెరా వర్క్ కూడా బావుంది. మొత్తంగా అభిమానులకే కాక, సామాన్య మాస్ ప్రేక్షకుడికి కూడా 'ఉస్తాద్ భగత్‌సింగ్' నచ్చే అవకాశం ఉంది.

## యశ్ దయాల్‌పై ఆర్‌సీబీ వేటు..?




ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మైనర్ బాలికపై అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న తమ లెఫ్టార్మ్ పేసర్ యశ్ దయాల్‌పై వేటు వేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వ్యవహారంపై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కానీ అతన్ని జట్టుకు దూరంగా ఉంచారనే విషయం మాత్రం స్పష్టమవుతోంది. అప్‌కమింగ్ ఐపీఎల్ 2026 సీజన్‌కు ఇంకా వారం రోజుల సమయం మాత్రమే ఉండగా.. యశ్ దయాల్ ఇంకా ఆర్‌సీబీ ప్రాక్టీస్ క్యాంప్‌లో పాల్గొనలేదు. టీమ్ బస్సుపై కూడా యశ్ దయాల్ మినహా జట్టులోని ఆటగాళ్లందరి ఫొటోలు ఉండటం ఈ వార్తలకు బలం చేకూరుస్తోంది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనపై ఐదేళ్లుగా అత్యాచారం చేస్తున్నాడని ఓ యువతి యశ్ దయాల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసు విషయం వెలుగులోకి వచ్చిన కొద్ది రోజులకే మరో అమ్మాయి కూడా తనను అత్యాచారం చేశాడని పోలీసులను ఆశ్రయించింది. ఆమె వయసు 17 ఏళ్లే కావడంతో పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసుల నేపథ్యంలోనే యశ్ దయాల్‌పై ఆర్‌సీబీ వేటు వేసినట్లు అర్థమవుతుంది. అతని స్థానంలో ఉమేశ్ యాదవ్‌ను తీసుకోవాలని టీమ్‌మేనేజ్‌మెంట్ ఆలోచిస్తున్నట్లు జాతీయ మీడియా పేర్కొంది. అయితే అతనికి కొన్ని ఫిట్‌నెస్ సమస్యలు ఉన్నాయని, దాంతోనే యశ్ దయాల్‌కు ప్రత్యామ్నాయ ప్లేయర్ ఎవరా? అనేది ఆర్‌సీబీ తేల్చుకోలేకపోతుందంట. అత్యాచారం కేసులో అరెస్టు అయి బెయిల్‌పై బయటకు వచ్చిన యశ్ దయాల్.. గత నెల సీక్రెట్‌గా పెళ్లి చేసుకున్నాడు. ఫిబ్రవరి 4న నోయిడాలో పెళ్లి చేసుకున్నట్టు వార్తలు వచ్చాయి. వధూవరుల కుటుంబ సభ్యులతో పాటు అతి కొద్ది మంది బంధుమిత్రులు మాత్రమే ఈ పెళ్లికి హాజరయ్యారు. యశ్ దయాల్ పెళ్లికి క్రికెటర్లు ఎవ్వరూ హాజరుకాలేదు. యశ్ దయాల్.. తన పెళ్లి గురించి ఎలాంటి ప్రకటన చేయలేదు. కానీ అతని భార్య శ్వేతా పుందిర్ ఇన్‌స్టా రీల్ ద్వారా తమ పెళ్లి విసయాన్ని బయటపెట్టింది. సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్ అయిన శ్వేతా పుందిర్‌కి ఇన్‌స్టాగ్రామ్‌లో సుమారు 6 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. అలాగే ఇంటర్నేషనల్ లెజెండ్స్ లీగ్‌లో బ్రాడ్ కాస్టర్‌గా కూడా ఆమె వ్యవహరించింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆర్‌సీబీ విజేతగా నిలవడంలో యశ్ దయాల్ 13 వికెట్లతో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్ 2023 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున బరిలోకి దిగిన యశ్ దయాల్.. రింకూ సింగ్ ధాటికి వరుసగా ఒకే ఓవర్‌లో 5 సిక్సర్లు సమర్పించుకున్నాడు.

# క్రీడోదయం


## ఆర్సీబీ మాజీ ప్లేయర్ విధ్వంసం.. 69 బంతుల్లో 195 పరుగులు



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మాజీ ఆటగాడు స్వస్తిక్ చికారా విధ్వంసం సృష్టించాడు. ఐపీఎల్ 2026 మినీ-వేలంలో అమ్ముడుపోని ఈ ప్లేయర్ అయోధ్య ప్రీమియర్ లీగ్‌లో అజేయంగా 195 పరుగులు చేశాడు. అయోధ్య ప్రీమియర్ లీగ్ పోరులో హిండన్ టైటాన్స్‌పై గోమతి థండర్ తరఫున ఓపెనర్లుగా బరిలోకి దిగిన ప్రియాంశు పాండే, చికారా ఇన్నింగ్స్ ఆద్యంతం బ్యాటింగ్ చేసి 307 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

పాండే 54 బంతుల్లో 100 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇదే సమయంలో మరో ఓపెనర్ చికారా హిండన్ టైటాన్స్ బౌలర్లపై మెరుపు దాడి చేశాడు. బౌలింగ్ చేసేందుకు కూడా టైటాన్స్ భయపడేలా విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు స్విస్తిక్ చికారా. అతడి 195 పరుగుల్లో సిక్సర్లతోనే 126 పరుగులు వచ్చాయంటే.. అతడు ఏ స్థాయిలో టైటాన్స్ బౌలర్లను ఉతికారేశాడో అర్థం చేసుకోవచ్చు. 69 బంతుల్లో 21 సిక్సర్లు, 11 బౌండరీలతో 195లి పరుగులు సాధించాడు. చికారా డబుల్ సెంచరీకి 27 పరుగుల దూరంలో 173 పరుగుల వ్యక్తిగత స్కోర్ ఉన్నప్పుడూ ఇంకా ఐదు బంతులు మిగిలి ఉన్నాయి. సిక్స్, సిక్స్, ఫోర్, డాట్ బాల్, ఆపై మరో భారీ సిక్సర్‌తో ఆ ఉత్కంఠభరితమైన ఇన్నింగ్స్‌ను చికారా ముగించాడు.అనంతరం 308 పరుగుల టార్గెట్‌తో బ్యాంటింగ్ కు దిగిన టైటాన్స్ 218 పరుగులకే ఆలౌటైంది. టైటాన్స్ బ్యాటర్లలో శేఖర్ సిరోహి 33 బంతుల్లో 68 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. స్వస్తిక్ చికారా 2024 ఉత్తరప్రదేశ్ టీ20 లీగ్‌లో మీరట్ మావెరిక్స్ తరఫున ఆడుతున్నప్పుడు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాడు. ఆ లీగ్‌లోనే అత్యధికంగా 499 పరుగులు సాధించాడు. ఆ తర్వాత కొద్దికాలానికే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ కోసం యూపీ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ దేశవాళీ టోర్నీలో అతను నాలుగు మ్యాచ్‌లలో కేవలం 15 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఐపీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అతన్ని కొనుగోలు చేసింది. 2025లో ఒక్క ఐపీఎల్ మ్యాచ్‌లో కూడా ఆడకపోయినప్పటికీ, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తొలి టైటిల్ గెలిచిన జట్టులో చికారా సభ్యుడిగా ఉన్నాడు. ఐపీఎల్2026 వేలానికి ముందే అతడిని ఆర్సీబీ విడుదల చేయగా, ఆ వేలంలో అమ్ముడుపోలేదు.

## ఇంపాక్ట్ ప్లేయర్‌గా రోహిత్..



ఐపీఎల్‌లో అత్యధిక టైటిళ్లు గెలిచిన జట్లలో ముంబై ఇండియన్స్ ఒకటి. ఐదు సార్లు(2013, 2015, 2017, 2019, 2020) విజేతగా నిలిచింది. 8 ఏళ్ల వ్యవధిలో 5 టైటిళ్లు అందుకున్న ముంబై.. గత ఐదు సీజన్లలో మాత్రం ఒక్కసారి కూడా ఫైనల్ చేరలేకపోయింది. గత సీజన్‌లో ప్లే ఆఫ్స్ చేరినా.. ఫైనల్‌కు అర్హత సాధించలేక పోయింది. ఈ సారి ఎలాగైనా టైటిల్ గెలవాలనే యోచనలో ఉంది.జట్టు నిండా స్టార్ ఆటగాళ్లున్నా.. మునపటిలా ముంబై సత్తా చాటలేకపోతుంది. కానీ ఇటీవల టీమిండియా టీ20 ప్రపంచకప్ నిలబెట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన బుమ్రా, సూర్యకుమార్, హార్దిక్, తిలక్ ఫుల్‌ఫామ్‌లో ఉండటం జట్టుకు కలిసొచ్చే అంశం. అయితే అంతర్జాతీయ స్థాయిలో సక్సెస్‌ఫుల్ కెప్టెన్లుగా గుర్తింపు పొందిన రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, మిచెల్ సాంట్నర్‌లు ఉన్న జట్టును హార్దిక్ పాండ్యా ఎలా నడిపిస్తాడనేది కీలకం. ముంబైకి ఐదు టైటిళ్లు అందించిన రోహిత్ శర్మ ఈసారి కూడా ఇంపాక్ట్ ప్లేయర్‌గానే బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. అంతర్జాతీయ టీ20లతో పాటు టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రోహిత్.. కేవలం వన్డేల్లో మాత్రమే ఆడుతున్నాడు. ఐపీఎల్ 2026 సీజన్ కోసం ప్రాక్టీస్ కూడా మొదలుపెట్టాడు. రోహిత్ శర్మతో కలిసి క్వింటన్ డికాక్ ఓపెనింగ్ చేయనుండగా.. సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, విల్ జాక్స్ మిడిలార్డర్‌లో ఆడనున్నారు. హార్దిక్ పాండ్యా, నమన్ ధీర్‌లు ఫినిషర్ పాత్ర పోషించనున్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా మ్యాచ్‌ను ప్రత్యర్థి నుంచి లాగేసుకోవడంలో వీరికి అపార అనుభవం ఉంది. బ్యాటింగ్ ఆర్డర్‌లో ఒక్క డికాక్ మినహా మిగిలిన వాళ్లంతా భారత ఆటగాళ్లే కావడంతో.. విదేశీ ఆటగాళ్ల సేవలను వినియోగించుకునే విషయంలో ఫ్రాంచైజీ మంచి వెసులు బాటు ఉంది. విదేశీ కోటాలో డికాక్, రికెల్టన్, రూథర్‌ఫర్డ్, సాంట్నర్, విల్ జాక్స్, బాష్, ట్రెంట్ బౌల్ట్, ఘజన్‌ఫర్ అందుబాటులో ఉండగా.. డికాక్, జాక్స్, సాంట్నర్, బౌల్ట్ తుది జట్టులో ఉండటం ఖాయం. పరిస్థితులను బట్టి రూథర్‌ఫర్డ్, ఘజన్‌ఫర్‌ను ఆడించవచ్చు. బౌలింగ్ భారాన్ని బుమ్రా మోయనున్నాడు. దీపక్ చాహర్, ట్రెంట్ బౌల్ట్ నుంచి సహకారం అందితే ముంబై ఇండియన్స్‌కు తిరుగుండదు. విల్ జాక్స్, మిచెల్ సాంట్నర్‌తో పాటు మయాంక్ మార్కండే స్పిన్ బాధ్యతలు మోయనున్నారు.

### ముంబై ఇండియన్స్ తుది జట్టు(అంచనా)

రోహిత్ శర్మ, క్వింటన్ డికాక్(కీపర్), సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, విల్ జాక్స్, హార్దిక్ పాండ్యా, నమన్ ధీర్/షెర్ఫెన్ రూథర్‌ఫోర్డ్, మిచెల్ సాంట్నర్, దీపక్ చాహర్/శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, ట్రెంట్ బౌల్ట్, మయాంక్ మార్కండే(ఇంపాక్ట్)

Edited, Published and Owned by Lakshmi Narayana.B and printed at Dohil Publications. #B 28/07, R.G.K. Apartments, All India Radio Station Lane, Bellary Road, Kurnool - 518003.A.P.And Published from # B 28/07, R.G.K. Apartments. All India Radio Station Line Bellary Road, Kurnool - 518 003. A.P. Editor Lakshmi Narayana. B Reg. No. APTEL/2013/51636. Email.telugudailyudayam.gmail.com, dohilpublications@gmail.com, Web:www.metroudayam.com, Cell: +91-916-000-3999, +91-916-000-4999, +91-916-000-5999.